ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

ఫిబ్రవరి 22, 2015

– డా॥ బ్రహ్మానందం

ఆస్కార్ ఎవరిది!

బహు భాషా 'దృశ్యం'

'దృశ్యం' పేరుకు తగ్గట్టే...కమనీయ చిత్రం. అందుకేనేమో పలు భారతీయ భాషల్లో కూడా చిత్రీకరించి ప్రేక్షకులకు అందిస్తున్నారు. మళయాళంలో జీతూ జోసెఫ్ తీసిన 'దృశ్యం' బాక్సాఫీస్ దగ్గర బానే వసూలు చేసింది. మోహన్‌లాల్, మీనా ప్రధాన పాత్రలు పోషించి అభిమానుల దగ్గర మార్కులు బాగానే కొట్టేశారు. తర్వాత కన్నడ, తెలుగులో వచ్చేసింది. తాజాగా తమిళం, హిందీ భాషల్లో కూడా తీస్తున్నారు. చాన్నాళ్ల తర్వాత కెమెరా ముందుకు వస్తున్న నటి గౌతమి జాతీయ నటుడు కమల్‌హాసన్‌తో కలిసి తమిళ 'దృశ్యం'లో చేస్తోంది. కమల్ మీడియాతో మాట్లాడుతూ 'ఇది కుటుంబ కథ. గౌతమికి నచ్చింది. యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. ఓ కేబుల్ ఆపరేటర్ పాత్ర పోషిస్తున్నాను నేను ఇందులో' అన్నారు. విశేషం ఏమంటే మోహన్ లాల్ సరసన చేసిన మీనా తెలుగులోనూ వెంటేష్ జోడీగా అభిమానులను అలరించింది. ఇక హిందీ 'దృశ్యం'లో అక్షయ్ కుమార్ చేస్తాడని, కాదు అజయ్ దేవగన్ చేస్తాడని ఆమధ్య వార్తలొచ్చాయి. టాబూ ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తుందని కూడా అన్నారు. ఇవీ బహుభాషల్లో 'దృశ్యం' విశేషాలు. ●



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

విగ్రహ విలాస(ప)ం

◆ మనలో మాట

ఒకప్పుడు విగ్రహాలు గుళ్లలో మాత్రమే కనిపించేవి. అదీ... దేవతలు, దేవుళ్లు, వారి పరివారానివి. వీరిని మినహాయిస్తే రాజులు, మహారాజులు, చక్రవర్తుల విగ్రహాలు అగుపించేవి. ఇష్ట దైవాలకు ఆలయాలు కట్టించి... అదే ప్రాంగణంలో తమ విగ్రహం కూడా పెట్టించుకునేవారు. అలా తమ ప్రతిష్టను, దర్పాన్ని చాటుకునే ప్రయత్నం చేసేవారు పాలకులు. ఆ తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నేతల విగ్రహాలు పెట్టుకున్నారు ప్రజలు. ఆనక తీవ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రధానులను విగ్రహాల రూపంలో తమ మధ్యే నిలబెట్టుకున్నారు. తమకోసం... తమ బాగు కోసం పని చేసిన కుల నాయకుల విగ్రహాలు పెట్టుకోవడం మొదలైంది. అయితే వీరంతా మన మధ్య లేకుండా పోయాకే జరిగింది.

ఇప్పడా ట్రెండు పూర్తిగా మారిపోయింది. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఏ సందు చూసినా ఏ గొంది చూసినా విగ్రహాలే. కుప్పలు తెప్పలుగా. పోయాక పెట్టుకున్నవి కావవి. సజీవులే విగ్రహ రూపంలో సాక్షాత్కరిస్తున్నారు. వీటిలో అభిమాన గణాలు పెట్టించే విగ్రహాల సంగతి సరేసరి. సినీ తారలు, రాజకీయ నేతలకు ఫ్యాన్ ఫాలోయింగ్ బా...గా ఎక్కువ కదా. అభిమాన హీరోలు, హీరోయిన్లకు గుళ్లు కట్టించడం, విగ్రహ ప్రతిష్ట చేయడం, పూజలు చేయించడం వారికో తుప్తి. ఈ పిచ్చి తారా స్థాయికి చేరుకుంటుంది అప్పడప్పడూ. మన ప్రధానిగారికి కూడా గుజరాత్‌లో గుడి కట్టేసి విగ్రహం పెట్టేశారు. ఒకటి రెండు రోజుల్లో ఆలయ ప్రారంభోత్సవం చేస్తారనగా జ్ఞానోదయమైన పీఎం తన ఫ్యాన్లను సుతిమెత్తగా మందలించి విగ్రహం తీసేయమన్నారు. మామూలుగా అయితే గుడి ఓపెనింగ్‌ని అంగీకరించేవారేమో! పాపం ఈమధ్యే ఢిల్లీ ఎన్నికలలో ఘోర పరాజయం పాలయ్యేసరికి... మొహం చెల్లక ఆ నిర్ణయం తీసుకుని వుంటారని గుసగుస. ఈ విషయం తెల్సి ఉత్తరప్రదేశ్ మంత్రి ఒకరు తమ అధినేతకూ గుడి కట్టి విగ్రహం పెట్టిస్తానని వీరంగం వేసేశాడు. బీహార్‌లో లల్లూజీకి కూడా ఇలాంటి ప్రయత్నం ఒకటి జరిగింది గతంలో. సార్ ఎప్పడూ గేదెలు, గోవులు, గడ్డితో మీడియాకు ఫోజులిస్తుండడం వల్లో ఏమో! శ్రీకృష్ణుడి అవతారంలో ఆయనకో విగ్రహం పెట్టించాలని చూశారు. కాకపోతే అప్పట్లో రాష్ట్ర ఎన్నికల కోడ్ అమల్లో వున్నందువల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారట. ఇక ఉత్తర ప్రదేశ్ రోడ్ల మీద కనిపించే మాయావతి విగ్రహాలకు, వారి పార్టీ చిహ్నామైన ఏనుగుల బొమ్మలకూ అంతే లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఆ విగ్రహాలకు పరదాలు కట్టించేపని ఎన్నికల కమిషన్ మీద పడుతుంది. విగ్రహాల ఏర్పాటుకైన ఖర్చు చాలదన్నట్టు వీటికి ముసుగులేయడానికి..తీయడానికి అదనపు ఆవదం! ఇక నిత్యం రద్దీగా వుండే జాతీయ రహదారుల మీద ... వాహనాల రాకపోకలకు అడ్డంగా పెట్టిన విగ్రహాల తొలగింపు మరో ఫార్సు. జాతికి స్ఫూర్తి ప్రదాతలు, మార్గదర్శకులు అయిన వారి విగ్రహాలు ప్రతిష్టించుకుని నిత్యస్ఫూర్తి పొందుతుంటాం. అలాంటి వారిలో తమ ప్రాంతానికి చెందిన వారి విగ్రహాలు లేవని ... వేరే ప్రాంతం వారి విగ్రహాలను ధ్వంసం చేయడం చూస్తుంటాం. విడ్డూరం కాకపోతే స్ఫూర్తి పొందడానికి ప్రాంతం..గోత్రం అడ్డొస్తాయా! అందుకే విగ్రహాల ఏర్పాటులోగానీ విధ్వంసంలోగానీ నిగ్రహం ఎంతైనా అవసరం. ■

టపా

కదిలించింది

ఫిబ్రవరి 08 స్నేహలో ప్రచురితమైన "కదిలించే కథనాలు చలింపచేసే చిత్రాలు" భోపాల్ క్షతగాత్రుల జ్ఞాపకాలతో ఏర్పాటుచేసిన మ్యూజియం గురించి చదువుతుంటే మనసు హృద్యంగా మారక మానదు. ఆ కథనం నిజంగానే కదిలించింది. చలింపచేసింది. అన్నార్థుల ఆర్తనాధాలు అక్కడ వినిపిస్తాయి. చరిత్రలో ఇది ఘోర దుర్ఘటన. ప్రేమ విప్లవం సీరియల్ ప్రతివారం చదివించేలా ఉంటుంది.

బాచిన జ్యోతి, పంగులూరు, ప్రకాశం జిల్లా.

విలువైన ఉత్తరం

మిగిలిపోయింది దానం చెయ్యడం కాదు. మిగిల్చి దానం చేయాలన్నదే అమృతగారి ధ్యేయం. దీన్ని ఆచరణలో పెట్టడానికి మధుబని పెయింటింగ్స్ నేర్చుకొని అనాథలను విజ్ఞానవంతులను చేయడానికి వారి చదువులకు ఖర్చుపెడుతున్నది ఆమె. మిత్రుడికి ప్రాణం గురించి భగత్‌సింగ్ రాయలేదు. జీవితం గురించి రాసారు. ఇది అందరికీ వర్తించే విలువైన ఉత్తరం. పాపం సుబ్బారావు కథ విశాఖను కుదిపేసిన హుద్‌హుద్ తుఫాను, అది మిగిల్చిన బాధలను గుర్తుకుతెచ్చింది. రాజకీయ యజమానులకు మనుషులను సప్లై చేస్తున్న సుబ్బారావు లాంటి వారు బాధితులకు వచ్చిన సహాయ సరుకులను దోచుకోవడం వంటివి రచయిత ఈ కథ ద్వారా తెలిపారు.

ఇలిపిళ్ల సూర్యనారాయణ
భీమునిపట్నం, విజయవాడ.

అలనాటి స్వర్ణయుగం

"రోజులు మారాయి" సంచలన చిత్ర వజ్రోత్సవం నేపథ్యంలో ఆ చిత్రం కథానేపథ్యాన్ని గురించి వచ్చిన కథనం చలనచిత్ర స్వర్ణయుగాన్ని ఒకసారి మననం చేసుకునే విధంగా ఉంది. ఆనాటి భూస్వామ్య వ్యవస్థ దాష్టీకాలను ప్రశ్నిస్తూ వచ్చిన ఆ చిత్రం సామాజిక సందేశాన్ని, వినోదాన్ని మేళవించి నవరసభరితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అందులో ఎక్కువ భాగం ప్రజానాట్య మండలి వారి పాత్ర ఉండటం వల్లనే ఆ చిత్రం అంతలా ప్రేక్షకాదరణ పొందటానికి ప్రధాన కారణం.

ఎమ్. రాధాకృష్ణ, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా

టీం ఇండియా గెలవాలి

రొమ్ము క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రఘురామ్ గారు చెప్పిన విషయాలు చాలా ఆసక్తిగా అనిపించాయి. వైద్యురాలైన అమ్మకే వైద్యం చేయాల్సి రావడం బాధాకరం. అయితే అమ్మకొచ్చిన బాధ మరే స్త్రీకి రాకూడదని ఆయన చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. "గెలుపెవరిదో"? ప్రపంచకప్ గురించిన కథనం ఆకట్టుకుంది. ఆ కప్ విశేషాలను తెలియచేయడం బాగుంది. ఈ సారి కూడా మన టీం ఇండియా కప్‌తో రావాలని కోరుకుందాం!

రాజేష్ ముంతా, తెనాలి

నిజమైన ప్రేమ

'రక్తసంబంధం' కథ వాస్తవ జీవితం నుండి మలిచిన కథలా ఉంది. అయితే ఆడపిల్లకు పెళ్లితోనే భద్రత అనే విషయాన్ని మన పురుషభావజాలం పెంచిపోషించింది. దాన్ని పోగొట్టేలా ఈ కథ మలిస్తే ఇంకా బాగుండేది. తను నేర్చుకున్న కూచిపూడి నృత్యాన్ని పేదవిద్యార్థులకు పంచాలనుకొని లక్షల రూపాయల కొలువును సైతం కాదనుకున్న అచ్యుత మానస చేస్తున్న కృషి అభినందనీయం. 'యువ'లో భగత్‌సింగ్ ప్రేమ గొప్పతనం గురించి సుఖ్‌దేవ్‌కు రాసిన లేఖను ప్రచురించించారు. నిజమైన ప్రేమ అంటే ఏమిటి? ప్రేమకు కొలమానం? వంటి విషయాలను చిన్నవయస్సులోనే భగత్‌సింగ్ చెప్పిన మాటలు... చదువుతుంటే...ఆయన మానసిక పరిణతి, సమాజాన్ని తను ఎలా ప్రేమించాడో అర్థమవుతోంది.

మానె జగదీష్ క్రాంతి కుమార్, భీమవరం

ఈ సంచికలో....

అస్కార్ ఎవరిది?

కవర్‌స్టోరీ 14

చూస్తుండగానే ఏడాది హాలీవుడ్ రీలులా గిర్రున తిరిగిపోయింది. ఆస్కార్ అవార్డుల వేడుక మళ్లీ ముందుకు వచ్చేసింది. సాధారణంగా ఆస్కార్ పురస్కారం పొందే చిత్రాలు దర్శకుల గురించిన అంచనాలు ఇంచుమించుగా అంతిమ ఫలితాలతో సరిపోతుంటాయి. కొద్దిసార్లు మాత్రమే స్పష్టంగా చెప్పలేని స్థితి వస్తుంటుంది. ఈ సారి కూడా ఖచ్చితంగా చెప్పడం కష్టమేనని పరిశీలకులు అంటున్నారు.

యువ 3
మీరు చేసేది సరైన పనే

స్ఫూర్తి 4
కోల్పోయింది కాలు మాత్రమే... ఆత్మస్థైర్యాన్ని కాదు

వింతలోకం 5
అనాథ శునకాలు

కథ 6
నేనూ శబరి

నవ్వుల్ - పువ్వుల్ 8

తుది పలుకులు 9

సినిమా కబుర్లు 10
ఆ డైలాగులు పలకడం నాకూ బాధే

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
మిగిలిన అన్నంతో రుచులు

బాలనేస్తాలు 22
దారి ఎక్కడమ్మా?

కొత్త పుస్తకాలు 24
నీటి వివాదాల వెనుక నిజాలు

చూద్దామా
చౌమహల్లా ప్యాలెస్
.... 12

యువ

మీరు చేసేది సరైన పనే

కార్మికోద్యమ మహానాయకుడు...కడవరకూ పీడిత ప్రజల కన్నీటిని తుడిచేందుకు నిరంతరం కృషిచేసిన మహనీయుడు...ప్రపంచ కార్మికులంతా ఒక్కటేనని నినదించిన గొంతుక...మార్క్స్ తత్వాన్ని తనలో ఇనుమడింపచేసుకున్న గొప్ప వ్యక్తి....ప్రపంచ తత్వవేత్త వ్లదీమిర్ ఇల్యీచ్ (లెనిన్). ఆయన పేద ప్రజలు, సామాన్యులకు సైతం ఎంత దగ్గరగా ఉండేవారు. దగాపడ్డ జనానికి ఎలా అండగా నిలిచేవాడో చెప్పేందుకు ఈ సంఘటనే ఒక మచ్చుతునక



యుక్త వయస్సులో లెనిన్

వివాహం అయిన తరువాత కొత్త సంసారం షూష నదీ తీరాన ఉన్న మరో పెద్ద ఇంట్లోకి మారింది. వ్లదీమిర్ ఇల్యీచ్(లెనిన్)కి అక్కడ పని చేసుకునేందుకు ఒక పెద్ద పుస్తకాల బీరువా, ఎత్తైన బల్ల ఉన్న గది ఒకటుంది. శీతాకాలంలో గ్రామీణ గృహాలలో దీపాలు పెందలకడే ఆరిపోతాయి, కాని వ్లదీమిర్ ఇల్యీచ్ ఆకుపచ్చ దీపం మాత్రం రాత్రి చాలా పొద్దుపోయేవరకూ వెలుగుతూనే ఉంటుంది. ఆ ఎత్తైన బల్ల దగ్గర నిలబడి వ్రాయడమంటే ఆయనకు ఇష్టం. "రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థాభివృద్ధి" అనే గ్రంథాన్ని ఆయన అలాగే రాశాడు. ఆయన పనిలో నదేజ్దా కొన్‌స్తంతీనొవ్నా ఎంతో సహాయకారిగా ఉంటుంది. అంతేకాక ఆమె అప్పుడు శ్రామిక మహిళల గురించి ఒక పుస్తకం రాస్తుంది.

ఇద్దరూ ఒక చోటే ఉండి పని చేయడమంటే వారికి ఎంతో ఇష్టం. ఆ గదిలో ఇద్దరూ పక్కపక్కనే చెరొక టేబుల్ దగ్గర పని చేసుకునేవారు. తమ తీరిక సమయాన్నంతా కలిసే గడిపేవారు. వారప్పుడు యవ్వనంలో ఉన్నారు. ప్రేమలో ఉన్నారు.

ఒక నాడు మధ్యాహ్నం అత్తగారు వచ్చి వారు పని చేసుకునే గది తలుపు తట్టింది. వారిని చూడటానికి ఒకాయన వచ్చాడు అని చెప్పింది. వ్లదీమిర్ ఇల్యీచ్ చాలా పని తొందరలో ఉన్నాడు. తన రాత పనికి అంతరాయం కలగకూడదు అనుకున్నాడు. కాని, ఒక పేద రైతు సలహా కోసం తన వద్దకు వచ్చాడు కనుక, మిగతా పనులన్నీ పక్కకు నెట్టవలసిందే. అత్తగారు ఆ మనిషిని లోపలికి రమ్మని చెప్పింది. ఆ మనిషి ముసలివాడేం కాకపోయినప్పటికీ లోతుకు పోయిన కళ్లూ, బక్క చిక్కిన ముఖమూ చూస్తే మనిషి వాడిపోయినట్టు కనిపించాడు.

"కూర్చోండి" అన్నాడు వ్లదీమిర్ ఇల్యీచ్.

ఆ మనిషి కూర్చున్నాడు. ఒక ఎర్రని రుమాలులో కట్టబడిన ఒక గిన్నెను తన కాళ్ల దగ్గర పెట్టాడు.

ఆ మనిషి ఒక దూర గ్రామం నుండి వచ్చాడు. తన రాకకు కారణం ఏమిటో చెప్పనారంభించాడు. వారిది చాలా పేద కుటుంబం. అందుకనే అతని పెద్ద కూతుర్ని ఒక ధనిక రైతు పొలంలో పని చేయడానికి కూలీగా పంపించాడు. ఒక సంవత్సరం పనిచేస్తే అతడామెకు ఇవవై రూబుళ్లు ఇవ్వవలసి ఉంటుంది. ఆమె అక్కడ పదకొండు నెలలు పని చేసిన తరువాత ఆమె తల్లికి జబ్బు చేయడంతో పని మానుకొని ఇంటికి తిరిగి వచ్చేసింది. అయితే యజమాని ఆమె తన మాట ప్రకారం ఏడాది పాటు పనిచేయకుండా మధ్యలోనే మానేసిందని, నాకు నష్టం కలిగింది కావున నేను మీకు డబ్బు చెల్లించనవసరం లేదని చెప్పాడు.

"మరి ఆ పిల్ల అన్నాళ్లు ఉచితంగానే పని చేసిందనా?" అంటూ మొరపెట్టుకున్నాడు ఆ రైతు. "ఎంత మాత్రం కాదు" అన్నాడు వ్లదీమిర్ ఇల్యీచ్ ఉద్రేకంతో.

"మనం జిల్లా అధికార్లకు ఈ వ్యవహారాన్ని ఫిర్యాదు రూపంలో రాద్దాం. పరిష్కరించవలసిందిగా వారిని అడుగుదాం. ఈలోగా, మీరు ఈ వ్యవహారాన్ని కోర్టుకు లాగుతున్నానని ఆ యజమానితో చెప్పండి. దానితో అతనికి దైవభీతి పట్టుకుంటుంది".

కాగితం తీసుకుని వెంటనే ఒక ఫిర్యాదు రాశాడు. అది ఎంతో నమ్మకం కలిగించేలా ఉంది. ఆ తరువాత వ్లదీమిర్ ఇల్యీచ్ ఆ రైతుకు ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని కలుసుకోవాలో వివరంగా చెప్పాడు.

"నిజం మీ పక్షాన ఉంది. ఈ విషయాన్ని క్షణం కూడా మరచిపోకండి. లొంగ వద్దండి. వాళ్లు ఈ మొదటి ఫిర్యాదును ఖాతరు చేయకపోతే నా దగ్గరకు మళ్లీ రండి. ఇంకా పై అధికార్లకు ఫిర్యాదు చేద్దాం. మీరు చేసేది సరైన పనే".

ఆ మనిషి, వ్లదీమిర్ ఇల్యీచ్‌కి కృతజ్ఞత తెలుపుతూ తన చేతిలో ఉన్న టోపీ ఆడించాడు. ఆ తరువాత అతడు ఎర్ర రుమాలులో మూట కట్టి ఉన్న గిన్నెను పైకెత్తి నదేజ్దా కొన్‌స్తంతీనొవ్నాతో ఇలా అన్నాడు "దయ ఉంచి ఈ వెన్న తీసుకోండి. ఇది నా సంతోషానికి గుర్తు అమ్మా"

"ఎంత మాత్రం తీసుకోను " అన్నదామె.

"లేదు. మేమా వెన్న తీసుకోము" అన్నాడు వ్లదీమిర్ నిక్కచ్చిగా.

వారు ప్రతిఫలం ఎందుకు కోరడంలేదో ఆ రైతుకు అర్థంకాలేదు. వింత మనుషులు ఈ నగరవాసులు. ఇల్యీచ్ తన కోసం ఫిర్యాదు పత్రం రాయలేదా? ఊరికినే రాసిచ్చాడా? ఆ మనిషి, రాజకీయ ప్రవాసిగా ఉన్న వ్లదీమిర్ ఇల్యీచ్‌ని తన హృదయంలో అభినందించుకుంటూ వెళ్లిపోయాడు. వ్లదీమిర్ తాను షూషెంస్కాయెలో నివసించిన కాలంలో స్థానిక రైతుల హృదయాలలో ఇలాంటి ఎన్నో ప్రియమైన స్మృతులను వదిలిపెట్టాడు.

లెనిన్ దంపతులు

కోల్పోయింది కాలు మాత్రమే.... ఆత్మస్థైర్యాన్ని కాదు

జీవితంలో ఎదురయ్యే కొన్ని సంఘటనలు పెను మార్పుకు కారణమవుతాయంటారు. అలాంటి ఓ సంఘటన కిరణ్ కనోజియా జీవితంలోనూ ఎదురయ్యింది. ఇక అన్నీ మంచిరోజులే అనుకుంటున్న సమయంలో... ఊహించని ప్రమాదం సంభవించింది. కాలును కోల్పోయింది. కానీ ఆత్మస్థైర్యాన్ని కాదు....నాన్న మాటలు స్ఫూర్తిని రగిలించాయి. ప్రముఖ నర్తకి సుధాచంద్రన్, అరుణిమా సిన్హా వంటి వారి గాథలు మార్గాన్ని చూపించాయి. ముందుకు నడిచింది. ఒక కాలుతో కాదు... వెయ్యేనుగుల బలమంత కృషి, పట్టుదలతో... అవే కిరణ్‌ను పదిమందికి స్ఫూర్తి కిరణంలా నిలిచేలా మలిచాయి.

కిరణ్ కనోజియా స్వస్థలం హర్యానలోని ఫరీదాబాద్. తండ్రి మధ్యతరగతి రైతు. ఆమె చిన్న నాటి నుండే చదువుల్లో ముందుండేది. ఎమ్.సి.ఏ పూర్తి చేసింది. కళాశాల ప్రాంగణ నియామకాల్లోనే హైద్రాబాద్ ఇన్‌ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం . రెండు పదుల జీతం... జీవితం హాయిగా గడిచిపోతుంది. అమ్మ,నాన్న కూడా కూతురు స్థిరపడినట్టే ...ఇంకేముంది తర్వాత పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుంది అని సంతోషపడ్డారు. కిరణ్ పుట్టిన రోజు డిసెంబర్ 25. ఆ ఏడాది 2011... పుట్టిన రోజు వేడుకల్ని అమ్మా,నాన్న సమక్షంలో జరుపుకోవాలనుకుంది. రైలులో సొంతూరుకు ప్రయాణమయ్యింది. ఇంకో గంటలో చేరుకోవాల్సిన స్టేజీ వచ్చేస్తుంది అనుకుంటుండగా అంతలోనే ఊహించని దుర్ఘటన. ఇద్దరు దుండగులు కిరణ్ చేతిలోని బ్యాగ్‌ను లాక్కొని పారిపోతున్నారు. వారి దుశ్చర్యను గమనించిన ఆమె వారితో పెనుగులాడింది. తన బ్యాగ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్న ఆమెను దొంగలు రైల్లోనుండి బయటకు తోసేసారు. కళ్లు తెరిచే సరికి ఆసుపత్రిలో ఉంది. "నన్ను ఎవరు ఆసుపత్రిలో చేర్పించారో కూడా గుర్తులేదు. కళ్లు తెరిచి చూస్తే పక్కన నాన్న ఉన్నారు. అప్పుడే ఒక పెద్ద డాక్టర్ పరీక్షించి ఏడమ కాలు మోకాలు వరకు తీసేయాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం అని చెప్పారు. ఆ క్షణం నా జీవితమే వృద్ధా అయిపోయింది అనుకున్నాను. అప్పుడు నాన్న అన్నారు.."జాన్ బచ్చితో లాక్ పాయే"అని అంటే ప్రాణాలతో ఉంటే చాలు అదే లక్షల్ని తెచ్చిపెడుతుందని దాని అర్థం. ఆ సంఘటన ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతుంది. మరి కొన్ని నిమిషాల్లో నా పుట్టిన రోజు వచ్చేస్తుంది. మరో

పక్క నా కాలు తొలగించడానికి అంగీరిస్తూ ఆసుపత్రి వారి అగ్రిమెంట్‌పై నాన్న సంతకం పెట్టాడు. ఆ సమయంలో నా తల్లిదండ్రులు బాధనంతటినీ కడుపులో దాచుకొని నాతో మాత్రంసుథాచంద్రన్ ప్రమాదంలో కాలు పోగొట్టుకుంది. కానీ ఆమె నృత్యం చేయడం ఆపలేదు. శరీరంలో కేవలం ఒక కాలుపోతే ఇక జీవితమే పోయినటు కాదు...అంటూ ధైర్యం చెప్పారు".

కొత్త ప్రపంచం

కొంతకాలానికి గాయం మానింది. కానీ మనస్సులో మాత్రం బాధ అలాగేఉండిపోయింది. తిరిగి ఉద్యోగంలో చేరేందుకు హైదరాబాద్ వచ్చాను. నాకు సాయంగా అమ్మకూడా నా వెంట వచ్చింది. రోజూ ఆఫీసుకు వెళ్లేదాన్ని. కానీ గతంలో ఉన్నంత సంతోషంగా మాత్రం లేను అని అనేవారు సహోద్యోగులు. కృత్రిమ కాలు కోసం దక్షిణ్ రిహాబిలిటేషన్ సెంటర్ వారిని సంప్రదించమని స్నేహితులు సలహా ఇచ్చారు. ఫేస్‌బుక్ ద్వారా దక్షిణ్ రిహాబిలిటేషన్ వారు అందించే సేవలను తెలుసుకున్నాను. ఆ సంస్థను నిర్వహిస్తున్న మోహన్ గాంధీ గారిని కలిసాను. ఆయన అందించిన ప్రోత్సాహం మరిచిపోలేనిది. అక్కడే డి.పి.సింగ్ అనే కల్నల్ పరిచయమయ్యారు. ఆయన కార్గిల్ యుద్ధంలో కాలుపోగొట్టుకున్నాడు. ఆయనతో మాట్లాడిన తర్వాత నాకు ఒక కొత్త ప్రపంచం పరిచయమైనంత అనుభూతి కలిగింది. ఆస్కార్ పిక్టోరియస్ గురించి కల్నల్ అంకుల్ చెప్పారు. ఆయనకు రెండు కాళ్లు లేవు. కానీ ఆసియా లోనే మొట్టమొదటి బ్లేడ్ రన్నర్. ఆయన కథనం విన్నాక నాలోకూడా ఏమైనా సాధించాలి.అనే ఆసక్తి పెరిగింది. కృత్రిమ కాలుతో సైక్లింగ్ ప్రాక్టీస్ చేసాను. మొదట్లో తడబడ్డాను. కింద పడిపోయేదాన్ని. తర్వాత అలవాటైపోయింది. ఆదిత్య మెహతాతో సైక్లింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఒకసారి హైదరాబాద్ నుండి వికారాబాద్ వరకుసుమారు 75 కిలోమీటర్లు సైకిల్ తొక్కాను. అప్పుడు అనిపించింది సాధించాలనే పట్టుదల ఉండాలే కానీ మనిషి సాధించలేనిదంటూ ఏమీ లేదని.

మొదటి బ్లేడ్ రన్నర్ నేనే

ఆస్కార్ పిక్టోరియస్‌లా నేను పరిగెత్తాలనే ఆలోచన కలిగింది. దక్షిణ్ రిహాబిలిటేషన్ వారితో ఆ విషయం చెప్పినప్పుడు వారు ప్రోత్సహించి పరిగెత్తేందుకు ఉపకరించే బ్లేడ్ అందించారు. దానితో పరిగెత్తడం మొదలుపెట్టాను. మొదట పది కిలోమీటర్లు, తర్వాత పదిహేను కిలోమీటర్లు అలా ప్రయత్నించాను. గత ఏడాది హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ మారథాన్ లో పాల్గొన్నా. 3గంటల 30 నిమిషాల్లో 21 కిలోమీటర్లు (ఆఫ్ మారథాన్) పరిగెత్తా. తర్వాత జనవరిలో జరిగిన మారథాన్‌లో 2గంటల 45 నిమిషాల్లో ఆఫ్ మారథాన్ పూర్తిచేయగలిగా. అంతేకాదు రొమ్ము క్యాన్సర్ పై మహిళల్లో చైతన్యం కలిగించే పింక్‌థాన్‌కు ఇప్పుడు అంబాసిడర్ కూడా నేనే. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భాగ్యనగరం, నెక్లెస్ రోడ్‌లో జరిగే మహిళాథాన్‌లో కూడా పాల్గొనబోతున్నాను. నా పరుగు చూసి రీబాక్ కంపెనీ వారు బ్రాండెడ్ బూట్లు బహుమతి ఇచ్చారు. పేరాలంపిక్స్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాను. అందులో విజయం సాధించడమే నా లక్ష్యం. మన శరీరంలో ప్రతి అవయవం ముఖ్యమైనదే. అవి మనిషికి ప్రకృతి ఇచ్చిన కానుక. కనుక ప్రతి ఒక్కరూ అవయవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి అని చెబుతోంది కిరణ్ కనోజియా.

- కారుసాల అనిత

◆ వింతలోకం

గొర్రెలతో విందు

ఈ మధ్య రకరకాల రెస్టారెంట్లు పుడుతున్నాయి. కస్టమర్లకు ఇష్టమైన వంటకాలను అందించడమే కాక...వారికి వినోదాన్నిచ్చేలా...రకరకాల జంతువులను, పక్షులను రెస్టారెంట్లలో వుంచుతున్నారు.

ఆ మధ్య గబ్బిలాల రెస్టారెంట్ గురించి చదివాం. పావురాలు, జిరాఫీలు, పాములతో కలిసి విందు ఆరగించే అవకాశమున్న కేఫ్‌ల గురించి తెలుసుకున్నాం. జపాన్‌లో పిల్లుల కేఫ్‌లు, కొరియాలో కుక్కల కేఫ్, వియత్నాంలో పెంపుడు జంతువుల కేఫ్ వున్నాయి. ఇవాళ్టి ప్రత్యేకత ఏమంటే ... గొర్రెలతో కలిసి కూర్చుని ఇష్టమైన పుడ్డు లాగించే కేఫ్ ఒకటి వుంది. ఇక్కడ కాఫీ, టీ, కేకులు వంటి వాటిని చక్కగా తాగొచ్చు. తినొచ్చు. అంతర్జాలంలో ఈ కేఫ్ ఫొటోలు చూసి తెగ లైక్ చేసేస్తున్నారట వీక్షకులు.

అనాథ శునకాలు

అప్పటి వరకు ఓ ఇంట్లో పెంపుడు కుక్కగా వుండి...అకస్మాత్తుగా వీధిన పడితే! ఎలా వుంటుంది? తమను ప్రేమగా పలకరించేవారు... ఆదుకునేవారు...ఇష్టమైన ఆహారం పెట్టేవారు...లేక...అలా నడి రోడ్డుమీద ఒంటరిగా నిలవాల్సి వస్తే...కుక్కలకే కాదు! వాటిని చూసే వారికీ గుండె తరుక్కుపోతుంది. అలాంటి ఘటనలు ఈ మధ్యే రెండు జరిగాయి. ప్రదేశాలు వేరైనా పాపం వాటి దీన గాథ మాత్రం ఒకటే. శునకప్రియుల బాధ కూడా ఒకటే. జనవరిలో అనుకుంటా! గ్లాస్గోలోని ఐర్ రైల్వే స్టేషన్ దగ్గర ఓ కుక్కను గొలుసుతో కట్టేసి వెళ్లిపోయారెవరో! విశేషం ఏమంటే ఆ పక్కనే దానికి సంబంధించిన వస్తువులతో కూడిన సూట్కేసు కూడా వదిలిపెట్టారు. యజమాని వస్తాడని తీసుకెళతాడని ఎదురుచూసీ చూసీ డీలా పడిపోయిందా శునకం. ఎంతకీ దాన్నెవరూ తీసుకెళ్లకపోవడంతో ఎవరో దాని ఫొటో... తెల్సిన వివరాలను సోషల్ మీడియాలో పెట్టారు. ఇక చూస్కోండి! ఎక్కడెక్కడి నుంచో వెల్లువలా వచ్చి పడ్డాయి పరామర్శలు. ఇక రెండో ఘటన జరిగింది స్టాఫోర్డ్‌షైర్‌లో. ఇక్కడ కూడా సేమ్ టు సేమ్ అలానే జరిగింది. యజమానిగారు ఈ నల్ల కుక్కను తీసుకొచ్చి ఈస్ట్‌బోర్న్ రైల్వే స్టేషన్‌లో కట్టేసి వెళ్లిపోయాడు. దాని ఎదురుగా ఒక నీళ్ల బొచ్చె మాత్రమే ఏర్పాటు చేశాడు. ఓ గంట సేపు యజమాని కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసింది. సమయం గడిచే కొద్దీ అతను రాడన్న నిశ్చయానికొచ్చేసి కళ్లెంట నీళ్లు పెట్టేసుకుంది. ఇక అటుగా వెళ్లేవాళ్లు ...వచ్చేవాళ్లు దాని దీనగాథ చూసి చలించిపోయారట. తాత్కాలికంగా దాన్ని ఓ డాగ్ హోమ్‌కు తరలించారు.

పెద్ద పాప

కొంతమంది అసలు వయసుకంటే చిన్న వారిగా కనిపిస్తుంటారు. అంటే...అరవయ్యేళ్లున్నా...నలభయ్యో పడిలో వున్నట్టే కనిపిస్తారు. మరికొందరేమో పాతికేళ్లకే వృద్ధాప్యంలో వున్నట్టు అగుపిస్తారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న 'పాప'ది ప్రత్యేకమైన కేసు. చూడ్డానికి ఆరేడేళ్ల పాపాయిలా కనిపిస్తున్నా...ఆమె వయసు చెప్తే ఆశ్చర్యపోవడం మీ వంతౌతుంది. తనకు పంతొమ్మిదేళ్లు. చూడ్డానికి మాత్రం నర్సరీ చిన్నారిలా వుంటుంది. తన పేరు జెంగ్ యుషన్. చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో పుట్టింది. చిన్నతనంలో పిట్యుటరీ గ్రంథికి సంబంధించిన సమస్య వుందని వైద్యులు చెప్పేసరికే తల్లిదండ్రులిద్దరూ విడాకులు తీసుకున్నారు. తండ్రితో నివసించేది జెంగ్. అయితే కొద్ది కాలానికే ఆమె తండ్రికి కూడా క్యాన్సర్ వ్యాధి వుందని బయటపడడంతో ఆమె కష్టాలు మరింతగా పెరిగిపోయాయి. మామూలుగానే వారివి అంతంత మాత్రపు బతుకులు. ఐదేళ్ల కిందట తండ్రి చనిపోవడంతో ఆ అమ్మాయి పూర్తిగా అనాథ అయిపోయింది. జెంగ్ గురించి తెలిసి తనను చూసి జాలిపడిన ఓ జంట తనను అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం ఆమె మంచీ చెడూ వాళ్లే చూస్తున్నారు. విశేషం ఏమంటే ఆ దంపతులకు ఇద్దరు కూతుళ్లున్నారు. అయినపప్పటికీ జెంగ్‌ను దగ్గరకు తీసుకోవడం చూస్తే వారిది ఎంత దయాహృదయమో అర్థమౌతుంది. జెంగ్ శరీరమే కాదు. మానసిక ఎదుగుదల కూడా ఏడేళ్ల పాప అంతే వుంది. తనకు స్కూలుకెళ్లాలని కోరిక. కానీ ఏ స్కూలు వాళ్లూ చేర్చుకోడానికి సిద్ధంగా లేరు. ఎందుకంటే ఆమె అసలు వయసే ఆటంకం.

నేనూ-శబరి

శబరి నామేనత్త పేరది.
మా తాత ఆ పేరు ఎందుకు పెట్టాడో తెలియదు. పది సంవత్సరాలకే రాముడికి ఎంగిలి పండ్లు పెట్టే శబరిలా వుండేదంట.
వ్యక్తురాలు కాకుండానే పెళ్లి చేసారు. నాకు మాత్రం రవివర్మ చిత్రాల్లోని స్త్రీలా అదో రకమైన అందం, పవిత్రంగా కనిపిస్తుంది.
భర్త చిన్నతనంలోనే పోయాడు.
అత్తకు బోడిగుండు చేయించి, తెల్లటి చీర కట్టించి మా తాత ఇంట్లోనే వుంచారు.
అత్తకు నేనంటే ప్రేమ. 'అత్తా' అని నేను పిలిస్తే "నువ్వు నన్ను శబరి అని పిలవ్వే" అనేది. ఎవరూ లేనప్పుడు అలా పిలుచుకునేదాన్ని.
తన భర్త ఎంతో అందగాడని, అప్పుడే నూనుగు మీసాలు వస్తున్నాయని, ఏ వ్యాధో తెలియకుండా చనిపోయాడని, కనీసం తనను గాఢంగా ఓ ముద్దు పెట్టుకోలేదని, మూడుముళ్లు వేస్తున్నప్పుడు అతని చెయ్యి తన మెడని తాకిన స్పర్శ మాత్రమే తనకు గుర్తుందని నాకు చెప్పేది. ఎప్పుడన్నా అవసరానికి వీధుల్లో తలదించుకుని వెళ్తుంటే, అదో అపశకునంగా భావించేవారని, ఇంకొందరు 'సిటీ పోలీసు' అని వెటకారంగా మాట్లాడేవారు అనేది. తన మాటల వల్ల ఆ పాతకాలపు రోజులు గురించి తెలిసేది. మా తాత ఛాందసుడు.
'మనం పిల్లల్ని కనగలం గాని వారి రాతల్ని కనలేం' అంటుండే వాడంట. ఆయన బతికున్నంత కాలం తన ముద్ర నుండి బయట పడలేదు. కుటుంబాన్ని తన దారిలోనే వుంచాడు.
మా నాన్న, బాబాయిలు చదువు విషయంలో కొంతవరకు ముందుకు వెళ్లారు. ఆంగ్లం చదివారు. అవన్నీ ఉద్యోగ సంపాదనకు సహాయపడ్డాయి. ఓ బాబాయి పౌరోహిత్యం స్వీకరించాడు. ఇద్దరు మేనత్తలు పెళ్ళిళ్లు చేసుకున్నారు. పిల్లలు పుట్టారు. చిన్నదయిన 'శబరి'కి మాత్రమే ఈ దుస్థితి వచ్చింది.
నాన్నకు మాత్రం ఇద్దరం. నేనూ, తమ్ముడు. మమ్మల్ని బాగా చదివించారు. ఇరవై రెండు సంవత్సరాల వయసులో 'ఆత్రేయ'తోనే నాకు వివాహం జరిగింది. తమ్ముడు చదువుకుంటున్నాడు.

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

ఆరోజు అందరూ బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్లారు. నన్నూ రమ్మన్నారు.
"ఇంట్లో శబరి మాత్రం కాపలానా? నేను రాను" అన్నాను. అప్పుడు మా నాన్న అదోలా చూసాడు.
"ఎందుకు నువ్వు మీ అత్తతో అంత అనుబంధం పెంచుకుంటున్నావు. తనది అంత మంచి జాతకం కాదు" అన్నాడు. చివ్వుక్కు మంది నాకు. అత్తతో మాట్లాడటానికి ఇంతకంటే మంచి సందర్భాలు నాకు దొరకవు.
ఇంటికి పెద్దవాడిగా తాత తర్వాత నాన్న శబరి బాధ్యతను తీసుకున్నాడు. నాన్నకి అత్తంటే ప్రేమ వుంది. అందరినీ ఈ బాధ్యత తీసుకోమని తాత చెప్పినా నాన్న శబరిని వంతులు వేయనివ్వలేదు. నాన్నని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను.
వీళ్లు వెళ్లాక శబరి మాట్లాడింది. ప్రశ్నలు నావి... జవాబులు తనవి.
"భర్త చనిపోతే ఇంక బతుకే వుండదా? ఇది 'సతి'కంటే ఏం తక్కువ" అన్నాను.
"మనుషులందరికీ జుత్తు అంటే ప్రేమ . ఒక్క భగవంతుడికే తలనీలాలు యిస్తారు. తిరిగి వెంట్రుకలు పెరిగే దాకా సిగ్గు పడుతూనో, వివరణలు ఇస్తూనో వుంటారు. మాకు అలాంటి అవకాశం లేకుండా చేసినందుకు సంతోషపడాలా!" అని నవ్వింది శబరి.
"ఈ హింసను ఎలా తట్టుకున్నావు శబరీ... మరీ ముఖ్యంగా రాత్రులు" అన్నాను.
"మా అమ్మానాన్నలు కూడా మా ముందు సంసారాలు చేసారు. నాన్నది బట్టతల. ఉప్పు, కారం తగ్గించిన వంటకాలే. అయినా కోరికను దాచుకున్నారా? కోరికంటే కేశాలేనా! తెల్లటి ముతక చీరలేనా? శోభనానికి తెల్ల చీర ఎందుకు కట్టుకుంటారు! వైధవ్యానికి అదే ఎందుకు చిహ్నం అయింది. ఎప్పుడో నియమాలు పెట్టారు. అవన్నీ పాటిస్తున్నారా? మరి ఆడవాళ్ల మీదే ఎందుకు వివక్ష!" అంది.
చిన్నగా తలూపాను.
"నువ్వు నా రాత్రుల గురించి అడుగుతున్నావు. మనిషికి ఆహారం ఎంత అవసరమో కామం కూడా అంతేకదా. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా రగిలిపోయేదాన్ని. రహస్యంగానో, బహిరంగంగానో కోరికలు తీర్చుకోవచ్చు. విధవలకు నెత్తిమీద బొచ్చులేకపోయినా, తెల్ల చీరను వదులుగా కట్టుకున్నా మగవాడు చలిస్తాడు. వాడికి కావాల్సింది దేహం తప్ప విలువలు కాదు. అందుకే తలలు బోడులయిన తలపులు బోడులవునా అనేది మగవారికి వర్తిస్తుంది" అంది.
"మా తరంలో కొందరు రహస్య సంబంధాలు పెట్టుకున్నారు. ఇంకొందరు ధైర్యం చేశారు" అంటుంటే
"నువ్వు ఎందుకు ఆ పని చేయలేదు?" అన్నాను.
తను మాట్లాడలేదు కొద్ది క్షణాలు.
"నువ్వు ఆకలితో చచ్చిపోయావంటే అయ్యో పాపం అంటారు. శృంగారం లేక బతుకుతున్న శవానివయితే ఎవరన్నా మాట్లాడతారా? ఈ దేశంలో శృంగారం గురించి మాట్లాడకూడదు. ఇక్కడ సౌందర్యం చావబట్టే ఈ కాపురాలు ఇలా ఏడుస్తున్నాయి. ఎంతమంది గుండెల మీద చెయ్యి వేసుకుని చెబుతారు అది మగవాడి కక్కుర్తి తీర్చటం తప్ప ఇద్దరి సమాన భాగస్వామ్యం వుంటుందా?"...
నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. అయితే అత్త మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యం. ఇలాంటి

వారిని కదిలిస్తే ఈ ప్రపంచం భరించలేని వాస్తవాలతో బద్దలవుతుంది. అవును. మనం మనుషులతో మాట్లాడటం మానేసాం కదా!

“ఇప్పటి మీ తరం వాళ్లకి మా బాధలు తెలియవు. మీకు స్వతంత్ర్యం వచ్చిందని అనుకుంటున్నారు. అది ఆ మాత్రం రావటానికి మగవాళ్లు కారణం. గతం గురించి మాట్లాడినప్పుడు ఆ కాలపు మనుషుల బలాలూ, బలహీనతలు గురించి మాట్లాడుకోవాలి. మీరు మాత్రం కొత్త సంకెళ్లలో లేరా?” అందోసారి.

శబరి చివరి క్షణాల్లో నేను దగ్గరే వున్నాను.

‘అగ్ని’ మాత్రమే ఆమె కాంక్షల్ని దహించి వేసింది.

* * * * *

ఆత్రేయతో ఉదయం ఫోన్లో మాట్లాడాను. తను ఆఫీసు పని మీద నార్త్ టూర్ వెళ్లి వారం రోజులు గడిచిపోయాయి.

“ఎప్పుడెప్పుడు వచ్చి నీ కౌగిట్లో వాలిపోవాలనుంది” అన్నాడు.

“నేనే చనిపోతే ఏం చేస్తావు?” అన్నాను.

“తులసీ...” అన్నాడు ఆందోళనగా.

“చిన్న ఊహకే అంత కంగారా!”

“సరదాకి కూడా అలా మాట్లాడకు”

“నా ప్రశ్నకి నువ్వు సమాధానం చెప్పలేదు”

“అదే మాట నేను అడిగితే?”

“ముందు నేను తలగొరిగించుకోను. తెల్లచీర కట్టుకోను. బొట్టూ, గాజులు తీసివేయను” అన్నాను. ఆత్రేయ మాట్లాడలేదు.

“మాట్లాడవేంటి ఆత్రీ?

“నీకు ఫోన్ ఎందుకు చేసానా అని ఫీలవుతున్నా. నీ ఎదురుగా వుంటే..?”

“ఏం చేసేవాడివి. చెంప పగలగొట్టే వాడివా?”

“చావు ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు. ఇంకొద్ది క్షణాల్లో చావు వస్తుందని తెలిస్తే నిన్ను గాఢంగా ముద్దు పెట్టుకుని ఆ అమృతపు చుక్కల్లైనా నన్ను బతికించమని వేడుకునేవాడ్ని”.

నాకు శబరి గుర్తొచ్చింది. ఓ ముత్యమంత ముద్దుకి, ఓ అపురూప అనుభవానికి నోచుకోకుండా వెళ్లిపోయింది.“వీడికి శృంగారం తప్ప ఇంకోటి పట్టడం లేదనుకుంటున్నావా? నేను ముందుగా వెళ్లిపోతే మీ మేనత్తలా రూపం మార్చుకోవటం కాదు. మళ్లీ పెళ్లి చేసుకోవాలి. ఆత్రి జ్ఞాపకాల్తో బతుకుతాను అనొద్దు. తోడులేని జీవితం నరకం. నాకు టైమ్ అవుతోంది. బయలుదేరుతున్నాను” అన్నాడు.

“నేను ఎందుకలా మాట్లాడానో తెలియదు. ఈ క్షణం ఎంత ప్రేమ, ఆర్తి కలిగాయంటే “ నువ్వు లేని జీవితం నాకొద్దు. నిన్ను తలుచుకుంటూనే బతుకుతాను” అనేదాన్ని నా ఎదురుగా తనుంటే. నాకు వంట చేసుకోవాలనిపించ లేదు. పడుకున్నాను. గంట తర్వాత టీవీ ఆన్ చేస్తే

నేను తలదువ్వుకుంటున్నప్పుడు గుర్తొస్తాడు. ‘శబరి’ గుర్తొస్తుంది.నా ప్రశ్నకు మౌనంగా ఎందుకు వుందో ఇప్పుడు అర్థం అయింది. ఇప్పుడు నాలో కోరికలు రగలటం లేదు. అందుకు కారణం ఆత్రేయ మీద ప్రేమ. ఆత్మీయత కాదు.అలాంటి ప్రేమ కావాలి. సహజీవనానికి కావలసింది ‘కామం’ కాదు. ఓ రోజున స్త్రీ, పురుషులకు శరీర అవయవాలు సహకరించవు. జీవితం చిన్నది. యవ్వనం యింకా చిన్నది. ప్రేమ శాశ్వతం. శబరికి అలాంటి ప్రేమ దొరకలేదు.

స్క్రోలింగ్‌లో ఓ చిన్నవాగు లాంటిది పొంగటం వల్ల కొన్ని వాహనాలు కొట్టుకుపోయాయనే వార్త వస్తోంది. అది ఆత్రేయ టూర్ చేస్తున్న ప్రాంతం! ఆత్రేయకి ఫోన్ చేసాను. చేస్తూనే వున్నా చివరికి నాన్నకి చేసాను.

* * * * *

వారం రోజులు గడిచిపోయాయి. ఆత్రి గురించి ఎలాంటి సమాచారం లేదు. చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసి ఇంటికి వచ్చాం. ఆఫీస్ వారు ఉద్యోగం ఇస్తామంటున్నారు. ఇంట్లో రెండు పక్కల వారు సమావేశమయ్యారు. కర్మాంతరాలు చేయాలన్నారు. నేను ఒప్పుకోలేదు. ఆత్రి బతికున్నాడని నా నమ్మకం.

“ఇది మా దురదృష్టం. శవం దొరకనంత మాత్రాన అనాథగా వదిలేయం. నిజంగా వాడు తిరిగివస్తే దిష్టి పోయిందనుకుంటాం. కర్మకాండలు చేయాల్సిందే” అన్నారు రెండు పక్కల వారు. నా ఇష్టానికి వ్యతిరేకంగా అన్నీ జరిగిపోయాయి. అప్పుడు మొదలయింది అసలు పోరాటం.

నాన్న తలవెంట్రుకలు తీయమన్నాడు. నేను ఒప్పుకోలేదు. సంప్రదాయం అన్నాడు. తాత ఆత్మ క్షోభిస్తుందని అన్నాడు.

“పోయినవారి ఆత్మల గురించి మీరు బాధపడొద్దు. మీరు అత్తకు చేసిన అన్యాయం వల్ల బతికి వున్నప్పుడే తన ఆత్మక్షోభించింది” అన్నాను.

“మీరు చదువుకున్నారు. మమ్మల్ని చదివించారు. ఆధునికంగా వస్తున్నవన్నీ మనం అనుభవిస్తున్నాం. పాత వాటికి మళ్లీ ప్రాణం పోయకండి” మృదువుగా చెప్పాను.

నాన్నకి కోపం వచ్చినా నిగ్రహించుకుని “నాలుగు కత్తెరలయినా వేయించు తులసీ” అన్నాడు.

నేను ఒప్పుకోలేదు. “ఇదంతా శబరి చేసింది. నాకు ముందు నుంచీ అనుమానమే. దాని బతుకులా దీని బతుకూ అవుతుందని అనిపిస్తూనే వుంది. అది పురిట్లోనే పోయుంటే బాగుండేది. దానికి చెప్పు, వాళ్ల అత్తగారింట్లోనూ పట్టింపులున్నాయి. అల్లుడిగారి మరణం వల్ల వచ్చే డబ్బులకి అడ్డుపడతారు. కోర్టుల చుట్టూ తిరిగాల్సి వుంటుంది” అని అమ్మతో చెప్పించారు.

“కోర్టుల దగ్గరికి వెళ్తాను. ఏది సంప్రదాయమో... ఏది చట్టబద్ధమో వాళ్లు చెబుతారు. అయినా సగం డబ్బులు మా అత్త మావయ్యలకు ఇవ్వటానికి నేను సిద్ధమే” అన్నాను.

నాన్న హతాశుడయ్యాడు.

“మా ఇంట్లో ఎలా పుట్టావే” అని చీదరించుకున్నాడు.

“మీరు ఎలా పుట్టారో శబరి అలా పుట్టింది. తమ్ముడు ఎలా పుట్టాడో నేను అలానే పుట్టాను. ఆడ పిల్లల పుట్టుకని ఇప్పటికీ శాసిస్తున్నారు. పుట్టబోయే ఆడపిల్లలు వితంతవులు అవుతారని ముందే చెప్పగల జ్యోతిష్యులు తయారయితే ఓ వంతు ఆడపిల్లలు పుట్టరేమో” అన్నాను.

“దాన్ని నోరు ముయ్యమని చెప్పు” అరిచాడు నాన్న.

“ఉప్పెనని మధ్యలో ఆగమంటే ఆగదు. మీలాంటి వారంతా తలమీద వెంట్రుకలు లేని ఆడపిల్లల్ని పుట్టించమని సైంటిస్టుల్ని అడగండి. ఇంక ఏ కోరికతో వుండని స్త్రీలను తయారు చేసే మందుల్ని సృష్టించమనండి. అంతే తప్ప మురిగిపోయిన వాటినన్నింటికి తిరిగి ప్రాణాలు పోయాలనుకోవద్దు” అన్నాను.

నాన్న విసురుగా అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

* * * * *

ఆ తర్వాత చాలా చర్చలు, రాయబారాలు. ఎవరు మాత్రం కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పగలరు! ఆడవాళ్ల మట్టిపెళ్లలు కాదు.

“తులసికి మొగుడు మీద ప్రేమ లేదు. ప్రేముంటే ఇలా మాట్లాడదు”

“శబరి దురదృష్టవంతురాలు కావచ్చు, ఇంత బరితెగించలేదు” అనేదాకా వెళ్లారు. శబరి వుంటే ఎంత నిర్మలంగా నవ్వుకునేదో!

* * * * *

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఆత్రేయ ఇంతవరకు రాలేదు. నేను తల దువ్వుకుంటున్నప్పుడు గుర్తొస్తాడు. ‘శబరి’ గుర్తొస్తుంది.నా ప్రశ్నకు మౌనంగా ఎందుకు వుందో ఇప్పుడు అర్థం అయింది. ఇప్పుడు నాలో కోరికలు రగలటం లేదు. అందుకు కారణం ఆత్రేయ మీద ప్రేమ. ఆత్మీయత కాదు.అలాంటి ప్రేమ కావాలి. సహజీవనానికి కావలసింది ‘ కామం’ కాదు. ఓ రోజున స్త్రీ, పురుషులకు శరీర అవయవాలు సహకరించవు. జీవితం చిన్నది. యవ్వనం యింకా చిన్నది. ప్రేమ శాశ్వతం. శబరికి అలాంటి ప్రేమ దొరకలేదు.

నేను ప్రేమ కోసం– ప్రేమించే మనిషికోసం ఎదురు చూస్తున్నాను. కేవలం పెళ్లి కోసం మాత్రమే కాదు. ఆత్రి చివరి కోరికను తీర్చగలననే నమ్మకం నాకుంది! ✦

నవ్వుల్ – పువ్వుల్



టక్కున



"నీ పుట్టినరోజు ఎప్పుడు బుజ్జి?" అడిగింది టీచర్.

"జులై 19న టీచర్!" చెప్పాడు బుజ్జి.

"ఏ సంవత్సరం?" అడిగింది టీచర్

"ప్రతి సంవత్సరం టీచర్" టక్కున చెప్పాడు బుజ్జి.

నిర్మాత

"బాబు గారు...ఈ రోజు రాత్రి టీవీలో రాబోయే సినిమాని చూడొచ్చా?" అని అడిగాడు పనిమనిషి రంగయ్య.

"ఇదేం కోరికయ్యా?" అన్నాడు ఆ ఇంటి యజమాని.

"ఇరవై సంవత్సరాల క్రితం ఆ సినిమా తీసింది నేనే బాబుగారు...ఓసారి ఆ ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామని" అని చెప్పాడు రంగయ్య.

రిలీజ్

"ఏమండీ ఈరోజు కొత్త సినిమా ఏమైనా రిలీజ్ అయిందా?" అడిగింది భార్య.

"ఏం మీ అయినట్టు లేదు. అయినా నీకెందుకొచ్చింది ఆ అనుమానం?" బదులుగా అన్నాడు భర్త.

"ఎప్పుడూ లేనిది మనవాడు పొద్దునే నిద్రలేచి, స్నానం చేసి కాలేజీకి వెళుతున్నానని చెబితేనూ...అనుమానం వచ్చింది" చెప్పింది భార్య.

తెలివైన టైగర్

రమేష్ : మా టైగర్ చాలా తెలివైనది.

సురేష్ : ఏంటో దాని గొప్పతనం?

రమేష్ : పొద్దున్నే పేపర్ తెచ్చిస్తుంది.

సురేష్ : ఇదీ విశేషమేనా..అన్ని కుక్కలూ చేసేదేగా.

రమేష్ : కానీ మేం పేపరు వేయించుకోముగా...

అగ్ని ప్రమాదం

అగ్నిమాపక సిబ్బంది: ఎక్కడ, అగ్ని ప్రమాదం జరిగిందెక్కడ?

మహిళలు: అగ్ని ప్రమాదం ఏం లేదండీ! పొద్దుట్నించి పంపుల్లో నీళ్లు రావడం లేదు. అందుకే మిమ్మల్ని పిలిచాం. తలా ఒక బిందెడు నీళ్లు పోసి పుణ్యం కట్టుకోండి.

ఫలితం

భార్యను ఆశ్చర్యపరుద్దామని ఆమె పుట్టింటికి వెళ్లి వచ్చేలోగా ఓ చీరకు ఫాల్ కుట్టాడు సంతోష్. భార్య ఎంతో సంతోషించింది.

'ఇవి కూడా కాస్త కుట్టి పెడతారా? మీకు టైమున్నప్పుడే' మరో రెండు చీరలు ఇస్తూ అంది.

సీరియల్



'ఈమధ్య వస్తున్న టీవీ సీరియల్సేమైనా చూస్తున్నావా వదినా ?'

'అబ్బే ....ఈ సీరియల్స్‌తో విసుగెత్తిపోయింది. వాస్తవ జీవితమే ఎంతో హాయి'

'వాస్తవ జీవితమా? ఎప్పుడు మొదలైంది? ఏ ఛానల్లో వస్తున్నది ? ఎన్ని గంటలకు వస్తోంది?'

పాతది

'అయ్యయ్యో ఇప్పుడు మీరు పగలకొట్టిన గ్లాసు ఐదు వేల సంవత్సరాల నాటిది" అన్నాడు మ్యూజియం ఉద్యోగి పాపారావుతో

'హమ్మయ్య బతికించారు. ఇంకా కొత్తదేమోనని భయపడి చచ్చాను' నిట్టూరుస్తూ అన్నాడు పాపారావు.

సేవ

'డాక్టరుగారూ! నేను చాలా పేదవాడినండీ. ..మీరడిగినంత డబ్బులిచ్చుకోలేను. ఉచితంగా వైద్యం చేయండి బాబూ. కానీ జీవితాంతం నేను పైసా పుచ్చుకోకుండా పని చేసి పెడతాను" వినయంగా అన్నాడా వ్యక్తి.

'సరే... ఇంతకూ నువ్వేం పని చేస్తుంటావు?" అడిగాడు డాక్టరు.

"కాటికాపరినండీ...శవాలు తగలబెడుతుంటాను" అన్నాడతను.

ఆలస్యం



'ఏమిటయ్యా గోవిందం. ఆఫీసుకు ఇంత ఆలస్యంగా వచ్చావు?' కోపంగా అడిగాడు ఆఫీసర్.

'నిద్ర లేవడం ఆలస్యమైంది సార్' చేతులు నలుపుకుంటూ అన్నాడు గోవిందు.

'వాట్! ఇంటి దగ్గర కూడా నిద్రపోతున్నావా?' ఆశ్చర్యంగా అన్నాడు ఆఫీసర్.

తుది పలుకులు

పుట్టుక చావులకు ఎవరూ అతీతులు కారనేది జగమెరిగిన సత్యం. అయితే బతికినన్నాళ్లు తన కోసమే కాక, తన చుట్టూ ఉన్న పదిమంది కోసం, మానవాళి అభివృద్ధి కోసం కృషిచేసిన వారు చరిత్రలో గొప్పవ్యక్తులుగా కీర్తింపబడతారు. వారి నోటి నుండి వచ్చే ప్రతి మాట...వారు చేసే ప్రతి పని చిరస్థాయిగా నిలిచిపోతుంది. సామాన్యులు సైతం వాటినుండే స్ఫూర్తి పొందుతారు. అలాంటి వ్యక్తులు జీవితం ఆఖరిక్షణంలో ఏమన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ఏవరికి మాత్రం ఉండదు చెప్పండి. మరి ఇంకెందుకు ఆలస్యం ఆ విషయాలను తెలుసుకుందామా!

- గాడ్సే కాల్చినపుడు గాంధీజీ "హేరామ్" అంటూ నేలకొరిగారు.
- విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ తన వేళ్ళతో గాలిలో రాస్తూ "ఇప్పుడేమవుతుందో తెలియదు కాని అంతా మంచే జరుగుతుంది" అని తుదిశ్వాస వదిలాడంట.
- "నేను చాలా అలసిపోయాను నాకు నిద్రవస్తోంది" అని శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు జార్జి బెర్నార్డ్ షా.
- ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత డబ్ల్యూ. సోమర్‌సెట్‌మాగమ్ మరణశయ్యపై ఉన్నప్పుడు తన సెక్రటరీతో "చావు గురించి ఎవరు ఎటువంటి బెంగ పెట్టుకోవలసినవసరం లేదు. అది సహజంగా జరిగే ప్రక్రియ" అంటూ తన సందేశాన్ని తెలియచేసి కన్నుమూసాడు.


టాల్‌స్టాయ్

- టైంమిషన్ వంటి సైన్స్‌ఫిక్షన్ కథలు రాసిన హెచ్.జి.వెల్స్ తనకు సపర్యలు చేస్తున్న నర్సుతో "చాలా ప్రశాంతంగా ఉంది. నాకు నీతో పనిలేదు. వెళ్లు" అన్నాడు.
- రోమ్ కాలిపోతున్నా ఏమాత్రం పట్టించుకోక ఫిడేలు వాయించిన వ్యక్తిగా చరిత్ర కెక్కిన నిరో చక్రవర్తి "అయ్యో!పాపం నాలాంటి గొప్ప వ్యక్తిని ఈలోకం పోగొట్టుకోబోతోంది" అని జాలిపడ్డాడంట.
- నైటింగల్ ఆఫ్ ఇండియా, తొలి మహిళా గవర్నర్ సరోజినీనాయుడుకు తన చివరి క్షణాల్లో ఒక పాట వినాలని కోరిక కల్గింది. తనకు సపర్యలు చేస్తున్న మనిషి చేత పాట పాడించుకొని తనువు చాలించింది.
- వినికిడి శక్తి కోల్పోయినపుటికి ప్రపంచ ప్రఖ్యాత సంగీత కళకారుడిగా పేరొందిన బోథోవెన్ తన ఆఖరిమాటగా వైన్‌తాగాలని ఉందని చెప్పాడు.


లూయ్ పాశ్చర్

- రేబీస్ వ్యాధికి ముందు కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ తన ఆఖరి క్షణాల్లో ఒక చేతితో భార్యను, మరో చేతిలో శిలువ పట్టుకొని "నా ప్రయాణానికి టైమ్ అయింది, ఏర్పాట్లు కూడా జరిగిపోయాయని" చెప్పి కన్నుమూశాడు.
- ఇంగ్లాండు చక్రవర్తి ఐదవ జార్జ్‌కి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ఆయన మరణించేటప్పుడు పక్కనే ఉన్న సలహాదారునితో "దేవుడు అంపైరింగ్ ఎలా ఉంది. చాలా బావుంది. కదూ" అంటూ క్రికెట్ పరిభాషలోనే తన మరణం గురించి చమత్కరించాడు.
- విజార్డ్ ఆఫ్ నార్త్‌గా పేరొందిన ప్రఖ్యాత రచయిత వాల్టర్ స్కాట్ "ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా నన్ను ప్రశాంతంగా చావనివ్వండి" అని ఆఖరి క్షణాల్లో చెప్పాడు.


ఐన్ స్టీన్

- రాబర్ట్ లూయిస్ స్టీవెన్ సన్ అనే కవి చివరి క్షణాల్లో చేయి సహకరించని స్థితిలో పేపర్ పెన్ను తీసుకొని "ఇప్పుడు నాలో కలుగుతున్న భావనలే మృత్యువైతే ఈజీగా ఫేస్ చేయవచ్చు" అని తన ఆఖరి వాక్యాలను రాసాడు.
- ప్రముఖ గ్రీకు తత్వవేత్త ప్లేటో "తనకు చికెన్ తినాలని ఉందని" చెప్పాడు.
- జర్మనీకి చెందిన ప్రముఖ కవి జె.డబ్ల్యూ.వాన్ గోథే చనిపోయేటపుడు వర్ణనాతీతమైన కాంతి కనబడుతోందని కలవరించాడు.
- సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ చనిపోయేముందు "తినడానికి బీఫ్ మాంసం తెచ్చివ్వమని" అడిగాడు.
- రష్యన్ రచయిత, తాత్వికుడైన లియో టాల్‌స్టాయ్ మరణానికి ముందు తన చుట్టు చేరివున్న అభిమానులను ఉద్దేసించి "ఇప్పుడు నాకేమి చేయాలో తెలియడం లేదు. మీలో ఎవరికైనా తెలుసా" అని పలికాడు.

సేకరణ- గోపాల్ శ్రీహరి
99390971246

సరోజినీ నాయుడు

ఆ డైలాగులు పలకటం నాకూ బాధే

ఆయన పేరు తలపుకొస్తే చాలు కితకితలు మొదలవుతాయి. ఇక తెరపై కనబడితే ప్రేక్షకుడి పొట్ట చెక్కలవ్వాల్సిందే. అందుకే చిన్నా, పెద్దా... తేడాలేకుండా అందరూ ఆయన హాస్యానికి అభిమానులే. ఆయనే తెలుగు చలన చిత్ర సీమ నవ్వుల రేడు... డాక్టర్ బ్రహ్మానందం. ఎప్పటికప్పుడు సరికొత్త నవ్వుల్ని ప్రేక్షకులకు పంచుతున్న కామెడీ కింగ్ బ్రహ్మానందం తన సినీ జీవిత విశేషాలను పుస్తకరూపంలో తీసుకురావాలనే తలంపుతో స్వీయచరిత్ర రాసేపనిలో ఉన్నారు. మరి ఆయన సినీ జీవితంలోని విశేషాలను వారి మాటల్లోనే తెలుసుకుందాం!

నవ్వించడం అన్నది అంత ఈజీ కాదంటారు చాలా మంది? అలాంటిది మీరు ముప్పైఏళ్ల నుండి తెలుగు ప్రేక్షకులను హాస్యంతో రంజింప చేస్తున్నారు? అందుకు మీరు తెరవెనుక తీసుకునే జాగ్రత్తలేమిటి?

సన్నివేశాన్ని నవ్వించే విధంగా మలచుకోవడం తప్పితే ప్రత్యేకమైన శ్రద్ధ అంటూ తీసుకోను. ప్రేక్షకుడికి నవ్వు తెప్పించాలంటే డిక్షన్, డైలాగ్, అభినయం ఈ మూడింటిని ఏలా పలికితే బాగుంటుందోనని ఆలోచిస్తాను. ఒక్కోసారి దర్శకుడి అనుమతితో ఈ సన్నివేశంలో ఇలా చేస్తే బాగుంటుంది అని చెప్పి మార్పులు చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి.

పెద్ద హీరోలు సైతం రాత్రిపగలు తేడా లేకుండా షూటింగ్‌లలో పాల్గొంటుంటారు ? మీరు మాత్రం సాయంత్రం 6గంటల తర్వాత ఎంత పెద్ద సినిమా అయినా చేయరని వినికిడి? నిజమేనా?

నాకంటూ కొన్ని వ్యక్తిగత అభీష్టాలు వుంటాయి గనుక వాటి ప్రకారమే నడుచుకోవాలనుకుంటాను. ముప్పై ఏళ్ళుగా ఆర్టిస్టుగా చేస్తున్నాను. వయస్సురీత్యా ఆరోగ్యం, పద్ధతులు చూసుకోవాలి. అందుకే కాల్షీట్ ఇచ్చేటప్పుడే 6గంటల తర్వాత చేయలేనని ముందుగానే చెప్పేస్తాను. పెద్ద హీరోలంటే వారు వేసవికాలంలో ఊటిలో షూటింగ్ చేద్దాం అంటే నిర్మాత చచ్చినట్టు ఒప్పుకుంటాడు. అదే నేను అడిగితే ఒప్పుకోరుగా...

సినిమారంగమంటే కొన్ని వ్యసనాలకు లోనవుతారనే అపోహ చాలా మందికి ఉంది? కొందరి ఉదంతాలు కూడా అందుకు ఉదాహరణలున్నాయి? ఇందులో వాస్తవమెంత ?

ఎవరికో ఏదో జరిగిందనీ మనం జాగ్రత్తగా వుండాలని అనుకోవడం కాదు. మనిషికి స్వతహాగా పుట్టిపెరిగిన వాతావరణం ప్రభావాన్ని చూపుతుంది. ఎవరూ కావాలని జీవితం నాశనం చేసుకోరు. కొన్ని పరిస్థితులవల్ల అలా జరుగుతుంటాయి. నేను చాలా ఉత్తముడ్ని అనుకోను. ఎవరి ఇష్టాలు వారివే. దాన్ని మనం కాదనలేం. అయితే ఆ పరిస్థితులను అధిగమించి ముందుకు నడిస్తే భవిష్యత్తు బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. నాలుగురోజులు ఎక్కువ నవ్వించగలం.

మీ ఇద్దరు అబ్బాయిల పేర్లు గౌతమ్, సిద్ధార్థ్ అని పెట్టారు. మీరు బుద్ధుడిని ఆరాధిస్తారా?

మన దగ్గర వందనోటు జేబులో పెట్టింది కనబడకపోతే హైరానా పడిపోతాం. సెల్‌ఫోన్ ఇంట్లో ఓ చోట పెట్టి మర్చిపోతే దొరికేవరకూ బీభత్సం సృష్టిస్తాం. అటువంటిది రాజ్యాధికారాన్ని, అందమైన భార్యను, బిడ్డను... తనకు అక్కర్లేదని తృణప్రాయంగా భావించి బయట ప్రపంచానికి ఏదో చేయాలని వచ్చిన మనిషి ఆయన.. తను నమ్మిన సత్యం కోసం వెళ్ళిపోయాడు. మనుషుల్లో గొప్పవాడుగా మిగిలిపోయాడు. ఆయన జీవితం స్ఫూర్తి దాయకం.



అందుకే మా అబ్బాయిలకు ఆపేర్లు పెట్టాను.

మీరు చిత్రకారుడుకూడా..దానికి మీ కుటుంబ నేపథ్య ప్రభావం వుందా?

మా ఇంట్లో ఎవ్వరికీ చిత్రలేఖనం తెలీదు. వారి మూలాల్నిబట్టి నైపుణ్యం అబ్బుతుందనేది నమ్మను. నాకు నటనతోపాటు చిత్రలేఖనం అనేది హాబీ. మనస్సుకు ఊరట కోసం బొమ్మలు గీస్తాను. అవి చూసుకుని తన్మయత్వం చెందుతుంటాను.

మీరేకాకుండా మీ కుమారుడికి కూడా కులాంతర వివాహం చేసారు కదా? మీ బంధువుల నుండి ఎలాంటి అభ్యంతరాలు రాలేదా?

కులం అనేది విచిత్రమైంది. నేను విదేశాలు చాలా తిరిగాను. ఎక్కడాలేని కొన్ని చిత్రమైన పరిస్థితులు ఇక్కడే వున్నాయి. కులాలు, మతాలు, మూఢాచారాలు, ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతులు.... కులం, మతం ప్రాంతం వీటికి అతీతంగా ఉన్నవాడే మనిషి అని నా భావన.

దేశాన్ని మార్చే శక్తి వస్తే ఏం చేస్తారు?

విద్యావిధానంలో మార్పుతీసుకువస్తాను.

ప్రజలు మారతారంటారా?

ప్రజలు మారతారు. కానీ కొన్ని పద్ధతులవల్ల పరిస్థితులు మారకుండా చేస్తున్నాయి. అందుకే వాటన్నింటిని మార్చేయాలి. అది అనుకున్నంత ఈజీ కాదు. అనర్హులైనవారు అర్హులైనవారి స్థితిలో వున్నారు. అంతెందుకు.. నేను మామూలు బట్టలు వేసుకుని పెరిగిన గడ్డంతో శిల్పకళావేదిక దగ్గర నిలబడితే... తోసేస్తారు. అదే మనిషి.. సూటు బూటువేసుకుని కొత్త కారులో దిగితే.. రండిసార్! అంటూ గౌరవంగా లోపలికి ఆహ్వానిస్తారు. అంటే వేషానికి, డాంబికానికే ఇక్కడ గౌరవిస్తున్నారు. సంస్కృతంలో మాట్లాడి అదేమాట తెలుగులో చెబితే గొప్పోడ్రా అంటారు. ఇంగ్లీషులో మాట్లాడి దాన్ని తెలుగులో చెబితే ఏం చెప్పాడ్రా అని మెచ్చుకుంటారు.

హాస్య నటుల్లో అల్లురామలింగయ్యగారి తర్వాత మీకే పద్మశ్రీ దక్కింది. ఇద్దరూ సుమారు వెయ్యి చిత్రాల్లో నటించారు? దీనికి మీరెలా ఫీలవుతున్నారు?

అల్లురామలింగయ్యగారికి రావడం గొప్పవిషయం. ఆ దశలో నాకూ వచ్చింది. దాన్ని ప్రత్యేకంగా తీసుకోవడం ఏమీలేదు.

ఏ ఇతర భాషా చలన చిత్రసీమలో లేనంత మంది హాస్యనటులు మన దగ్గరే వున్నారు. ఈ పోటీని ఎలా తట్టుకోగలుగుతున్నారు?

ఎవ్వరూ ఎక్కువ కాదు. తక్కువ కాదు. ప్రతివారిలోనూ సమర్థత వుంటుంది. పోటీ అనేది ఎందుకు వాడతారో నాకు తెలీదు. ఎవరిలో ప్రతిభ వుంటే వారినే పెట్టుకుంటారు. ఒక దరఖాస్తు ఇచ్చి దానికి స్టాంప్‌వేసి వీడిలో ప్రతిభ వుంది సినిమాల్లో తీసుకోండని అనరు. ఈ రంగంలో ప్రతిభ కావాలి. అది ఎవరిలో వుంటే వారిని అవకాశం వరిస్తుంది.

మనం ఏదైనా షాప్‌కెళ్ళి ఫలానా బ్రాండ్ కావాలని ఏవిధంగా కోరుకుంటామో.. బ్రహ్మానందం నవ్విస్తాడు.. ఆ బ్రాండే కావాలని అడుగుతుంటారు చాలా మంది ప్రేక్షకులు. అదే నా బ్రాండ్. దానికోసం ప్రత్యేకమైన శ్రద్ధలు తీసుకోవడాలు, 24 గంటలు ఆలోచించి తల బద్దలుకొట్టుకోను. సహజంగా చేస్తేనే ప్రేక్షకుడు ఫీలవుతాడు. అదే నేను చేసేది. ఇక్కడో మాట గుర్తుకువస్తుంది. మా ఎం.ఎస్. అంటుండేవాడు. 'ప్రయత్నిస్తూ మరణిస్తే విజయం. ప్రయత్నం విఫలమైతే మరణం' అని.. అది చాలా కరెక్ట్.

మీరు పెద్ద స్టార్ కమెడియన్. మరి మీ అబ్బాయి హీరోగా నటించాడు. కానీ అంత గుర్తింపు రాలేదు?

నేను ఫలానా, నా కొడుకును నిలబెట్టాలని బోర్డు కట్టుకుంటే కుదరదు. నా తండ్రి నన్ను నిలబెట్టలేదు. ఎవరికాళ్ళమీద వారు నిలబడాలి. ఫలానాది చేస్తున్నాను నాన్నగారు, అంటే ఏదైనా ఆర్థికసాయం కావాలంటే చేస్తాను అంతే. ఎవరి టాలెంట్‌వారిదే.

ఈ రంగంలో పూలు పడుతుంటాయి. రాళ్లు పడుతుంటాయి. ఈ రెండింటినీ ఎలా స్వీకరిస్తారు?



పొగడ్తలు,తెగడ్తలు, దూషణభూషణలూ అన్నీ వుంటాయి. బ్రహ్మానందం గొప్ప యాక్టర్ అంటారు కొంత మంది. కొందరేమో వాడిఫేసూ వాడూ... ఏంటీ బోడి వాడు చేసేది అనేవారూ వున్నారు. దాన్ని గొప్పగా తీసుకున్నట్లే దీన్ని తీసుకోవాలి. రెండూ సమపాళ్ళలో చూడాలి. మెచ్చుకున్నవాడే తిడతాడు. తిట్టినవాడే మెచ్చుకోవచ్చు. అయినా మన జీవితం ఒకరి మెప్పు కోసం కాదుకదా.

ఇవన్నీ చిన్నతనంలో నేర్చుకున్నారా?

మా తండ్రి పేద టీచర్. ఎనిమిది మంది పిల్లలం. మాకు ఏం నేర్పుతాడు. దరిద్రం నేర్పిన పాఠాలు నేర్పుతాడు. అందుకే దరిద్రం నా కన్నతల్లి అంటాను. దరిద్రాన్ని ప్రేమించకపోతే ఏమీ తెలీదు.

ఇక్కడో విషయం చెప్పాలి. ఇంట్లో కూర్చొని వున్నప్పుడు సపోటాలు, సీతాఫలాలు అమ్ముకునేవారు ఇంటిముందు అరుస్తూ తిరుగుతుంటారు. పిలుస్తా. బుట్ట మొత్తం కావాలంటాను. మంచి బేరం దొరికిందని ఆనందపడతాడు. అతను 200కు కొంటాడు. కానీ నాకు 600రూపాయలు చెబుతాడు. అతనికున్న భాషలో మోసం చేస్తున్నాడని అర్థమవుతుంది. దానికోసం ప్రత్యేకంగా పాలు పోసి పెంచాం సార్! అంటూ ఏదో కథ చెబుతాడు. బేరమాడి ఆఖరికి 500కు కొనేస్తే వాడి ముఖంలో కన్పించే ఆనందం కోట్లలో వుంటుంది. దానికి వెలకట్టలేం. అడిగినంత బ్రహ్మానందం ఇచ్చాడని.. ఆనందంతో ఇంటికివెళ్ళి వాళ్ళ ఆవిడకు చెప్పి కావాల్సింది కొనుక్కుని హాయిగా భోంచేసి నిద్రపోతాడు. ఇదంతామానవీయ దృక్కోణంతో చూస్తేనే మనకు తెలుస్తుంది. చెప్పింది అమలు చేయడం అనేది నా పాలసీ. కొన్నిసార్లు ఆచరణ కష్టం. కానీ ప్రయత్నమంటూ చేయాలికదా.



కుటుంబ సభ్యులతో....

కామెడీ పేరుతో బూతు మాటలు రాస్తున్నారు. దీని పై మీ అభిప్రాయం ?

ఇది మొదటినుంచీ వస్తున్న సమస్యే. మీరు చేస్తున్నారు కాబట్టి చూస్తున్నారు అంటారు కొందరు. వారు చూస్తున్నారు కనుక మేం చేస్తున్నాం అంటారు మరికొందరు. అలాంటి సన్నివేశాలు, సంభాషణలు పలికేటప్పుడు నాకూ బాధేస్తుంది. కానీ నేను చెప్పింది చేసేవాడినే కానీ, ఇలా చేయమని చెప్పేవాడ్ని కాదు. నాకు ఆ సన్నివేశం నచ్చలేదు...మార్చండి అంటే నీవు కాకపోతే మరొకరు పోవయ్యా అంటారు కానీ ఆ సన్నివేశం మార్చరు కదా!

పెద్ద చిత్రాలకు సైతం హిట్ ఫార్ములా మీరే అని ప్రేక్షకుల అభిప్రాయం. అందుకు మీరేమంటారు?

ప్రేక్షకులు అంటారు. ఎందుకంటే చూసినప్పుడు నవ్వించే వస్తువు నేను కాబట్టి, ప్రాధాన్యత నాపై తోసేస్తారు. వంద సినిమాల్లో సినిమాలే సక్సెస్ అవుతున్నాయి. మిగిలినవి ఐదు కావడంలేదుకదా. అసలు ఈ వ్యక్తిని తయారుచేసిన వ్యక్తి ఒకడున్నాడు. వాటిలో కవి, రచయిత, దర్శకుడు సృష్టికర్తలు. సృష్టించాక వారంతా నిర్మాతకు చెప్పాలి. బ్రహ్మానందం డబ్బులు ఎక్కువ అడిగినా ఇవ్వాలి. నాకిచ్చినదానితో ఎక్కువ సంపాదించాలని నిర్మాత అనుకోగలగాలి. దాన్ని నా విద్యతో న్యాయం చేయాలి. ఇన్ని కలిసి, అది కూడా పెద్ద హీరో అయితే అప్పుడు పేరు వస్తుంది. అదే చిన్న హీరోతో చేస్తే ఆ పేరు నాకురాదు. పెద్ద హీరో అయితే కోట్లమంది చూస్తారు కాబట్టి పేరు వస్తుంది.

మీ గురువు జంధ్యాలగారినుంచి ఎంతోమంది దర్శకులను చూశారు. దర్శకత్వం చేయాలని అనిపించలేదా?

దర్శకత్వం అంత సులువైంది కాదు. ఒక్కోసారి చూడగానే ఇంతేనా అనిపిస్తుంది. మిడిల్‌షాట్, ట్రాలీ, క్రెయిన్... ఇలా ఎన్నో పద్ధతులుంటాయి. అందుకే దుబాయ్‌లో విశ్వనాథ్‌గారికి సన్మానం చేస్తుంటే ఆయన కాళ్ళమీదపడ్డాను. ఆయన దర్శకత్వ ప్రతిభ అద్భుతమని నా అభిప్రాయం. ఒక సన్నివేశం పండాలంటే షాట్ ఎలా పెట్టాలి, ఎలా మెప్పించాలి. అనేది దర్శకుడికే తెలుసు. అది ప్రత్యేకమైన ఆర్ట్. మనం చూసేటప్పుడు చాలా ఈజీగా మనమూ చేసేయొచ్చు అనిపిస్తుంది. చదరంగం ఆడేటప్పుడు పక్కన చూసేవాడు ఛ... వీడు వేయరాని ఎత్తు వేసి చెడగొట్టాడు అంటాడు. పక్కనున్నవాడు అన్నీతెలిసినట్లు మాట్లాడేస్తాడు. కామెంట్లు దరిద్రంగా వుంటాయి. కానీ దిగేవాడికే లోతు తెలుస్తుంది.

ఇంటర్వ్యూ - పెండ్యాల మురళీకృష్ణ

చౌమహల్లా ప్యాలెస్

సెలవుల్లో టీవీ చూట్టమో, లేదంటే ఎంచక్కా గోళ్లు గిల్లుకోవడమో అన్నవి అనాదిగా మానవాళికి సంక్రమిస్తున్న గొప్ప హాబీలు. ఒకవేళ చూట్టానికి టీవీ, గిల్లుకోటానికి గోళ్లు రెండూ అందుబాటులో లేకపోతే జీవితం దుర్భరమైపోద్దేమో అన్న ఫీలింగ్ కలగక మానదు.!! నా పరిస్థితి అలాగే ఉండి ఉండెను ఒకానొక సండే దినాన. ఐతే, సెలవు రోజున చేయటానికేమీ లేకపోతే కనీసం కళాపోషణైనా చేయవోయ్... అని సెలవిచ్చాడట ఎవరో శాస్త్రకారుడు వెనకటికి. పోనీ, ఈ ఐడియా ఏదో భేషుగ్గా ఉందని చెప్పి, వర్కవుట్ చేసి, ఓ సుముహూర్తాన భాగ్యనగరంలో ఓ చారిత్రక పర్యటన నిర్వహించాను. అనగా, ఫ్రెండ్సుతో కలిసి చౌమహల్లా ప్యాలస్ సందర్శన చేశామన్నమాట.

నిజాం నగరానికొచ్చి దశాబ్దం గడిచినా ఇప్పటిదాకా ఈ రాజసౌధం గురించి వింటమే కానీ, చూసింది లేదాయే. చార్మినార్, మక్కా మసీద్, గోల్కొండ ఖిల్లా, సాలార్జంగ్ మ్యూజియం, బిర్లా ప్లానిటోరియం... ఇలాంటి వాటన్నింటినీ ఓ రౌండ్ వేసినా, చౌమహల్లా ప్యాలెస్ పై పెద్దగా దృష్టి సారించలేకపోయా, అక్కడేముంటుందిలే అని. తీరా పర్యటించి చూద్దును కదా.. అక్కడ అన్నీ ఆశ్చర్యాలే!! ఎక్స్ పెక్టేషన్స్ ఏమీ లేకుండా వెళ్లడం వల్లనేమో... ఈ ప్యాలెస్ అనేక వింతలతో మరింత అబ్బురపరిచింది.

ముందుగా టికెట్ దగ్గర్నుండి మొదలెడదాం. టికెట్టు ధర.. తిప్పి కొడితే ఓ పదో పరకో ఉంటుందనుకున్నా. కానీ 40 రూపాయలట. ఒకటో ఆశ్చర్యం! మొబైల్ తో ఫొటోలు తీస్కోవాలంటే మరో 50 రూపాయలు మూల్యం చెల్లించాలట. రెండో ఆశ్చర్యం!! ఎంటరవ్వంగానే క్యాంటీన్లో టీ తాగితే... గభాల్ని ఓ రెండు గాంధీ నోట్లు గుంజేస్కున్నాడు, భడవఖానా. మూడో ఆశ్చర్యం!!! కూసంత దూరం లోపలికెళ్లాక ఓ అందమైన కళంకారీ షాపు. అందులో శోభాయమానంగా వెలిగిపోతున్న విభిన్న కళాకృతుల మధ్య నాకెందుకో చెస్ బోర్డు తెగ నచ్చేసింది. నా తలకాయ అనబడు బీరువాలో కళల "అర" కంటే, క్రీడల "అర" డామినేషనే ఎక్కువగా ఉందని ఆ క్షణాన ఇంస్టింక్టివ్ గా కనిపెటేశా. సర్లెమ్మని, రేటు అడిగితే రూ.1300 జహాపనా అనేశాడు అతగాడు. ఆశ్చర్యం టు ది పవర్ ఆఫ్ టెన్!!!!!! జీ హుజూర్.. ఫిర్ మిలేంగే... అని సలాం కొట్టి, వెంటనే అబౌట్ టర్న్ తీసుకుని నిశ్శబ్దంగా నా కాళ్లు వాటంతటవే ఎగ్జిట్ గేటు వైపుగా వెళ్లిపోయాయ్. ఇట్టాంటి యాక్టివిటీస్ నే అసంకల్పిత ప్రతీకారచర్యలు అంటారని చిన్నప్పుడెప్పుడో చదువుకున్న పాఠం ఠకీమని గుర్తొచ్చింది. కాసేపు నిర్వేదంతో మనసులో ఇలా పేరడీ యాడ్ రూపంలో కుళ్లి కుళ్లి బాధపడ్డాను... ఈ నగరానికేమైంది? ఒకవైపు మూసీ రోత! మరోవైపు ధరల వాత! ఐనా, ఎవ్వరూ ముక్కు మూయరెందుకు? ఒక్కరూ నోరు మెదపరెందుకు?! ఖళ్ ఖళ్ ఖళ్ !!!

కాసేపటికి ఆశ్చర్యపోవడం కామనైపోయింది. ప్యాలెస్ గురించి టూకీగా నాలుగు మంచి ముక్కలు మాటాడుకుంటే... చౌ మహల్లా అంటే... నాలుగు (చౌ), భవనాలు (మహల్లా) అని అర్థమట. చార్మినార్ పక్కనే ఉన్న మక్కా మసీదుకు వెనకవైపున లాడ్ బజార్ ఏరియాలో ఉంటుందీ ప్యాలెస్. 270 ఏళ్ల క్రితం నిర్మించారట ఈ సౌధాన్ని. అసఫ్జాహీ వంశస్థులు నిర్మించిన అనేక కట్టడాల్లో ఇది ప్రశస్థమైందట. మొగల్ శైలిలో ఉంటుందీ నిర్మాణం. నిజాం నవాబుల పాలనకు అధికారిక నివాసంగా ఈ ప్యాలెస్ ఉండేదని ప్రతీతి. దీని విస్తీర్ణం 14 ఎకరాల పైమాటేనట. నాలుగు భవంతులుగా విభజించి ఉంటుంది. నింపాదిగా అన్ని భవంతుల్లోని విశేషాల్ని చూడాలంటే మినిమమ్ ఓ మూడు గంటలు పట్టుద్ది.

ఆపై ప్యాలెస్ లోపలి విశేషాల విషయానికొస్తే... అసఫ్జాహీ వంశస్థులైన నిజాం నవాబుల రాజసానికి, వైభవానికి సంబంధించిన చారిత్రక వస్తు సంపదను ఈ అందమైన భవంతుల్లో భద్రపరిచారు. రాయల్ దర్బార్ హాల్ భలేగా ఉంటుంది. నిజాం నవాబుల తాలూకు పింగాణీ పాత్రలు, కత్తులు, కటార్లు, వేషధారణలు, గుర్రపు బగ్గీలు, వింటేజ్ కార్లు, విశ్రాంతి మందిరాలు, ఇంకా ఎన్నో వింతలు, విశేషాలు, వంశ వృక్షాలు ఇలాంటి వాటన్నింటినీ అనేక గదుల్లో భద్రపరిచారు. ఓ రెండు పేద్ద వాటర్ ఫౌంటెన్లు, ఓ నాలుగు తెల్లని బాతులు, కొన్ని పచ్చిక బయళ్లు కూడా దర్శనమిస్తాయి. హైదరాబాదులో కచ్చితంగా చూడదగ్గ ప్రదేశమిది.

ఈ భవంతిలో ఉన్నవన్నీ రాజరికాల నాటి సంగతులు కదా. నవాబుల తాలూకు అతిశయం, డాంభికాలు, లగ్జూరియస్ వస్తు సేకరణలు వగైరా వగైరా తప్పించి, సామాన్యుల జీవన చిత్రం ప్రస్తావన గానీ, సొసైటీకి వారి కాంట్రిబ్యూషన్స్ గానీ, కళా, సాహిత్య వికాసాల ప్రస్తావన గానీ మనకు అగుపించవు. బహుశా... రాజరికాల శకం ముగింపు దశకు చేరుకుంటున్న కాలంలో ఈ నవాబులు జీవించారేమో (స్లేవరీ ఎండింగులో విలాసాల్లో మునిగితేలిన రోమన్లలాగా). అందుకే ఇక్కడ వారి విలాసాలు, భోగలాలసలే ఎక్కువగా కనబడతాయి. పోనీయండి. నాటి సంగతుల్ని నేటి దృక్పథంతో చూడ్డం కూడా సరికాదేమో. చివరగా, ఒక్క విషయం మాత్రం క్లియర్ గా అర్థమైంది. ఒక వ్యక్తి తాలూకు విలాసాలు, అధికార దర్పాలు, భోగభాగ్యాలనేవి అంతిమంగా మ్యూజియాలలో భద్రపరచబడితే ఆ వ్యక్తి తాలూకు మంచితనం, మానవత్వం లాంటి సద్గుణాలు మాత్రం వాటి మోతాదును బట్టి జనం గుండెల్లో నిక్షిప్తం చేయబడతాయని!! అదండీ చారిత్రక పర్యటన తర్వాత నేను కనిపెట్టిన టిపికల్ క్రిటికల్ ప్యాలెస్ ఫిలాసఫికల్ థియరీ.

జాతీయ సెలవు దినాలు, ప్రతి శుక్రవారం నాడు చౌమమల్లా ప్యాలెస్ తెరవరు. ప్యాలస్ సందర్శనవేళలు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు.

- ముత్యాలప్ప, హైదరాబాద్



నిజాం వాడిన రోల్స్ రాయిస్ కారు

విదేశీ అతిధులతో నిజాం విందు



ఇదే నాటి రాజ దర్బార్



పింగాణి పాత్రలు

చిత్రమాలిక

కవిత్వం ◆

చలిని దాటాను
ఎండపంట పండింది
ఉదయాన్ని దాటాను
సాయంత్రం స్వాగతించింది
నడిచి వచ్చిన నడక
జ్ఞాపకాల హరివిల్లు పరిచింది
మొదటి రంగులో తలమెడ
రెండో రంగులో ఉదరం కాళ్లు
బొమ్మకు అదనపు తాత్పర్యాలు
ఒక జ్ఞాపకం అమృతం
ఒక జ్ఞాపకం గరళం!
చినిగిన వాచకం
అట్ట చొక్కా తొడుక్కుని
పేజీ మంచాలపై నెమలీకలు
పరుచుకుని నిద్రించాక
పొదిగిన బిడ్డళ్ల వేళ్లలెక్కించి
పొందిన ఆనందం...
బడివేళలు చేయిపట్టి లాగుతుంటే
తెగిన సంచిని కుట్టటానికి
దొరకని సూదికై అమ్మ పరుగులు చూసి
నా అసహనం ఉప్పెనై తే
అమ్మ ఓర్పు చూసి సముద్రాలు సిగ్గుపడటం...
వారాల అబ్బాయిగా
నేనా ఇంటికి చేరితే
అత్యవసర పనుల్లో చిక్కిన ఆతల్లి చేతులు
నన్ను చూసి ఎసరుపెడితే
సిగ్గును జేబులో కుక్కి
అన్యమనస్కంగా ఆ ఇంట
ఒక మూలను ఆశ్రయించటం....
జ్ఞాపకాల తోరణంలో మెరుపులు!
ఇప్పటికిప్పుడు...
అంధబిక్షురాలి పాట రోడ్డుపై వరదైతే
ఈది దాటిన వైనం
వృద్ధురాలి కర్రపోటుకు భూదేవి మేల్కొని
చేయిపట్టి నడిపించిన ఔదార్యం
కుడిచేయి భిక్షాపాత్రయి
ఎడమచేయి శుష్కించిన పొట్టను చూపుతూ
అర్థిస్తున్న బాలుడి జీవన కథనం
కాళ్ల మీద తెగిపడ్డ పచ్చని ఆకు
తొడిమ తడిమి చూశాను
కన్నీటి తడితగిలింది
చెట్టు ఉయ్యాల్లో వూగాల్సిన ఆకు
ఎవరా అత్యాచారం చేసింది
నీ అడుగులు నువ్వు లెక్కిస్తే
అంతర్ముఖం
పరాయి లెక్కిస్తే
పురోగమనం!

అడిగోపుల వెంకటరత్నం
సెల్ నెంబర్ : 98482 52946

అట్టమీది కథ

ఆస్కార్ ఎవరిది?

- తె.ర

చూస్తుండగానే ఏడాది హాలివుడ్ రీలులా గిర్రున తిరిగిపోయింది. ఆస్కార్ అవార్డుల వేడుక మళ్లీ ముందుకు వచ్చేసింది. సాధారణంగా ఆస్కార్ పురస్కారం పొందే చిత్రాలు దర్శకుల గురించిన అంచనాలు ఇంచుమించుగా అంతిమ ఫలితాలతో సరిపోతుంటాయి. కొద్దిసార్లు మాత్రమే స్పష్టంగా చెప్పలేని స్థితి వస్తుంటుంది. ఈ సారి కూడా ఖచ్చితంగా చెప్పడం కష్టమేనని పరిశీలకులు అంటున్నారు. మిగిలిన వాటన్నిటినీ కాదని ఇదొక్కటే ప్రత్యేక చిత్రమని చెప్పే అవకాశం లేకపోవడం ఒక కారణమైతే- నానాటికి వివాద గ్రస్తమవుతున్న ఆస్కార్ తీరు మరో కారణం. అందుకే పదేళ్ల కాలంలో ఎన్నడూ లేనంత అనూహ్య ఫలితాలు ఈ సారి వుండవచ్చునని చెబుతున్నారు.

హాలివుడ్ స్వప్న ఫలం ఆస్కార్ పురస్కారం. ప్రపంచ చలన చిత్ర రంగానికి మకుటాయమానమైంది ఆస్కార్ అవార్డు అన్న అభిప్రాయం పాతుకుపోయింది. ఇతర రంగాల్లో నోబెల్‌ను గురించి చెప్పుకున్నట్టే నిత్య జీవితంలోనూ ఆస్కార్ గురించి కూడా తరచూ ప్రస్తావన వస్తుంటుంది. భారతీయ చిత్రాలకు ఆ ఆస్కారం వుందా లేదా అనేదానిపై వూహాగానాలు సాగిపోతుంటాయి. పురస్కారం సంగతి అటుంచి పేరు పరిశీలనకు వచ్చినా పరవశించి పోవడం కద్దు. ఆస్కార్ గురించిన కథలు ఎలా వున్నా నిజానికి ఈ అవార్డుకు చాలా చాలా పూర్వ రంగం వుంటుంది. ప్రతిఏటా ముందుగానే వివిధ విభాగాల కింద నామినేషన్ల జాబితా విడుదల చేస్తుంటారు. అయితే అందులో కూడా అన్నిటికన్నా అగ్రస్థానాన వున్న ఒకటి రెండు చిత్రాలే అవార్డులన్నీ పొందుతుంటాయి. అలా చూస్తే ఈ సారి "బర్డ్‌మ్యాన్", "బాయ్‌హుడ్" అనే రెండు చిత్రాల పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ ఎంపికకు కూడా స్పష్టమైన నేపథ్యముంటుంది. ఆస్కార్ పొందే చిత్రం కుటుంబ విలువలు కలిగివుండాలట. 'ఆర్టిస్ట్' చిత్రం కుటుంబమంతటితో చూసేది మాత్రమే కాదు. మీ బామ్మ కూడా ఆనందించగలిగిందిగా వుంటుంది. ఇంకా చెప్పాలంటే ఆ బామ్మ కూడా తన



రోస్‌మండ్

బామ్మతో కలసి ఆనందించగలిగిందై వుండాలట! ఒక్క ముక్కలో చెప్పాలంటే ఎలాంటి సామాజికత లేకుండా సకుటుంబ విలువల పేరిట దద్దోజనంలా వుండటమే గొప్పని 2010లో హిందూ విమర్శకుడు భరద్వాజ్ రంగన్ ముందే జోస్యం చెప్పాడు. నిజంగానే 'ఆర్టిస్ట్' ఉత్తమ చిత్రంగానే గాక ఉత్తమ నటుడు దర్శకుడు తదితర అనేక అవార్డులు తెచ్చుకోగలిగింది. ఆ చిత్రంలో మూకీ యుగం నాటి ఒక నటుడు తెరమరుగై పోతే ఆయన కారణంగా అప్పట్లో బాగా రాణింపునకు వచ్చిన ఒక ఎగ్రస్ట్రా నటి తనకు మళ్లీ అవకాశం వచ్చేలా చేయడం ఈ చిత్ర కథ. అందులోనూ అది నలుపు తెలుపు చిత్రం! రంగులకూ హంగులకూ పెట్టింది పేరైన హాలివుడ్ ప్రపంచంలో ఇదెలా విజేత కాగలిగింది? ఈ చిత్రం చాలా సాదా సీదాగా ఎలాంటి శ్రమ లేకుండా కళా హృదయాలను స్పృశించగలుగుతుందని అప్పట్లో ఇచ్చిన వివరణ. దాంతోపాటే సమకాలీన ప్రపంచాన్ని కాసేపైనా మర్చిపోయేలా చేసి అంతా బాగుందన్న భావన లేదా భ్రమ కలిగిస్తుందని గార్డియన్ పత్రిక రాసింది. తొమ్మిది సార్లు ఆస్కార్ వేడుకల సమర్పకుడిగా వ్యవహరించిన బిల్లీ క్రిస్టల్ ఒకసారి ఏమన్నాడంటే 'నేటి ప్రపంచంలోని ఆర్థిక సంక్షోభాలు వగైరాలను మర్చిపోయి కాసేపైనా హాయిగా వుండాలంటే ఏకైక మార్గం ఈ రాత్రి కొన్ని గంటల పాటు ఈ ఉత్సవాలను తిలకించి ఆనందించడమే'! ఇప్పుడు "బర్డ్‌మ్యాన్" కథ ఇంచుమించు నాటి "ఆర్టిస్ట్"కు దగ్గరగా వుంటుంది.

మాజీ హీరో మథనం

ఈ చిత్రం కూడా ఒక మాజీ హీరో కథతో నడుస్తుంది. "స్పైడర్ మ్యాన్" తరహాలో "బర్డ్‌మ్యాన్"గా బాగా పేరుతెచ్చుకున్న రిగ్గన్ థామ్సన్(మైకెల్ కేటాన్) అనే హీరో చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఎంతసేపటికీ తనను బర్డ్‌మ్యాన్‌గా తప్ప నటుడుగా గుర్తించకపోవడం అతన్ని చాలా బాధిస్తుంది. నటుడుగా తన సత్తా ఏమిటో చూపించాలనుకుంటాడు. జీక్ అనే మిత్రుడి సహాయంతో ఒక బ్రాడ్వే థియేటర్లో ఒక నాటకం ప్రదర్శించాలని భావిస్తాడు. అందుకోసం 'వాట్ వుయ్ టాక్ వెన్ వుయ్ టాక్ అబవుట్ లవ్' అనే నాటకం ఎంచుకుంటాడు. అప్పటి నుంచి అతని సమస్యలు మొదలవుతాయి. తనతో సహాయనటుడు రేమండ్‌గా మైక్ షెర్నర్‌ను ఎంచుకుంటాడు. అతను తనను మించిపోతున్నాడేమోనని సందేహంలో పడతాడు. ఇక నిర్మాణంలో తనకు సహాయకురాలిగా కూతురు శామ్‌ను(ఎమ్మా స్టోన్) ఎంచుకుంటాడు. ఆమె మాదక ద్రవ్యాలకు బానిసై ఎలాగో విముక్తి పొందినా అనేక సమస్యలు ఎదుర్కొంటుంది. నాటకంపై లేనిపోని విమర్శలు రాకుండా చేసుకోవడానికి గాను న్యూయార్క్ టైమ్స్ విమర్శకుడు డికన్సన్‌కు కొంత ఖర్చు చేయవలసి వస్తుంది. వీటన్నిటి మధ్యనా అతను ఎలా వ్యవహరించాడన్నది కథాంశం. 'వుయ్ లివ్ అవర్ లైవ్స్‌విత్ నో ఎడిటింగ్' అనేది సందేశమైతే అన్ ఎక్స్‌పెక్టెడ్ వర్ఛ్యూ అఫ్ ఇగ్నోరెన్స్(అజ్ఞానం వల్ల అనూహ్య ప్రయోజనం) అని కూడా ఈ చిత్ర ఉపశీర్షిక. వసూళ్లలో రికార్డులు సృష్టించిన "బర్డ్‌మ్యాన్"ను దర్శకుడు అలెగ్జాండర్ గోనాలెంజ్ ఇషరూ ఎంతో ప్రత్యేక శ్రద్ధతో రూపొందించాడు. ఆయన ఉత్తమ దర్శకత్వం, స్క్రీన్‌ప్లేల జాబితాలోనూ వున్నారు. ఈ చిత్రానికి సంగీతం సమకూర్చింది ఆంటోనీ స్కాండ్ కాగా ఫోటోగ్రఫీ ఎమ్మానియల్ లుబెద్కీ. అత్యధికులు ఈ చిత్రంపైనే అంచనాలు పెట్టుకున్నారు. ఇప్పటికే గోల్డెన్ గ్లోబ్, ఎఎఫ్ఐ అవార్డులు కూడా ముందే రావడంతో అవి ఇంకా పెరిగిపోయాయి. ఇక ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారి మైకేల్ కీటాన్ తొలిసారి ఆస్కార్ ఉత్తమ నటుడి పురస్కారానికి నామినేట్ అయ్యాడు.

బాయ్ హుడ్

ఇక అన్ని విధాల దాంతో పోటాపోటీగా నువ్వా నేనా అని తలపడుతున్నది "బాయ్‌హుడ్". ఇదో ఆశ్చర్యకరమైన ప్రయోగం. నమ్మలేనంత చిత్రమైన ఆలోచన. ఒక పిల్లాడు అబ్బాయిగా ఎదిగే క్రమం ఎలా వుంటుందన్నది ప్రత్యక్షంగా చూపించడం కోసం దీన్ని అక్షరాలా పన్నెండేళ్లపాటు తీశాడు దర్శకుడు రిచర్డ్ లింక్లర్స్. టెక్సాస్‌లో మేసన్, ఎల్లార్ కొల్లన్ దంపతుల చిన్న కుమారుడు మేసన్ జూనియర్. అతనికో అక్క కూడా వుంటుంది. అయితే తలిదండ్రులు విడిపోతారు. సంరక్షణ తల్లి ఎల్లార్‌కు అప్పగించి మేసన్‌కు వారానికి ఒకసారి వచ్చి చూసే అవకాశం కల్పిస్తుంది న్యాయస్థానం. అయితే అతను మొదట్లో క్రమబద్ధంగా వచ్చి చూసిపోతుంటాడు గాని మధ్యలో చాలా ఏళ్ల పాటు రాడు. తర్వాత వచ్చి తాను సంగీత రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ అలస్కాలో వుండిపోవలసి వచ్చిందని చెబుతాడు. వయస్సుతో వచ్చే మార్పులు ఒకవైపు, విడాకులు తీసుకున్న తలిదండ్రుల ఘర్షణలు మరోవైపు ఆవేశపూరిత వాతావరణం కల్పిస్తుంటాయి. వీటన్నిటి మధ్యనా జూనియర్ మేసన్ ఎలా పెరిగిపెద్దవాడయ్యాడనేది వాస్తవికంగా చూపిస్తుందీ చిత్రం. ఈ చిత్రంలో బాల నటీనటులు నిజంగానే పెరిగి పెద్దయ్యేదాకా నటిస్తూనే వుంటారు గనక గుర్తు పట్టలేనంతగా వారి రూపాలు మారిపోతాయి. ఆర్థిక వనరులకు లోటు లేని చోటు గనక హాలివుడ్ పుష్కర కాలం పాటు చిత్ర నిర్మాణం భరించి నటీనటులను అట్టిపెట్టుకోగలిగింది! ఇప్పుడీ చిత్రం ఉత్తమ చిత్రంగానూ ఉత్తమ దర్శకత్వం లోనూ నామినేషన్ పొందింది. దీనిపైన కూడా భారీ అంచనాలున్నాయి.



గ్రాండ్ బుడాపెస్ట్ హెూటల్

ఈ సారి ముఖ్యంగా వినిపిస్తున్న పేర్లలో ఇదొకటి. 'బుడాపెస్ట్' ఇదివరకటి సోషలిస్టు దేశమైన హంగరీ రాజధాని. అయితే చిత్రంలో మాత్రం 'జుబ్రోకా' అని కల్పితమైన పేరు పెట్టారు. కథలోకి వెళితే– ఒకమ్మాయి గ్రాండ్ బుడాపెస్ట్ హెూటల్‌ను సందర్శిస్తుంది. అక్కడ ఆమెకు ఒక రచయిత తారసపడతాడు. 1968లో తాను అక్కడకు వచ్చినపుడు కలుసుకున్న హెూటల్ అధినేత జీరో ముస్తఫా సంగతులు చెబుతాడు. ఆ విధంగా ప్రధాన కథ ఫ్లాష్‌బ్యాక్‌గా నడుస్తుంది. 1932కు వెళుతుంది. మొదటి రెండవ ప్రపంచయుద్ధాల మధ్య కాలం అది. గుస్తావ్ హెచ్ ఆ హెూటల్‌ను చూసుకుంటుంటాడు. జీరో ముస్తఫా అతని దగ్గర బాయ్. గుస్తావ్‌కు చాలా మర్యాదస్తుడని పేరు. తన హెూటల్‌కు వచ్చేవారికి ఏ కొరత రాకుండా చూసుకుంటానని చెబుతుంటాడు. ఆఖరుకు స్త్రీ, పురుష కస్టమర్లు ఎవరొచ్చినా వారి ధోరణులను బట్టి శృంగార అవసరాలు కూడా తీర్చేస్తుంటాడు. మరీ ముఖ్యంగా వయసు మళ్లిన యూరోపియన్ మహిళలకు సేవలందిస్తుంటాడు.

వివక్షకు గురైన మార్టిన్ లూథర్ చిత్రం

ఆస్కార్ జాబితాల అవతలి వేపు చూపించే తాజా ఉదాహరణ సెల్మా. నల్లజాతి హక్కుల యోధుడు మార్టిన్ లూథర్ కింగ్ జీవిత ఘట్టం ఆధారంగా తీసిన చిత్రమిది. సమాన ఓటింగు హక్కుల కోసం ఆయన 1965లో సెల్మా నుంచి మాంటెగ్మరీ వరకూ ఉద్యమ యాత్ర జరిపాడు. ఆ సమయంలో దారిపొడుగునా ఉత్తేజం నింపాడు. అనేక అవరోధాలు ఎదుర్కొన్నాడు. చివరకు లక్ష్యం సాధించాడు. 'అవె దివెనరీ' ఈ చిత్రాన్ని ఎంతోబాగా చిత్రీకరించారు. కేవలం ఆయన జీవితాన్ని చూపించాలనే గాక వాస్తవ చరిత్రను అందించే ప్రయత్నం చేసి ప్రశంసలు పొందారు. సెల్మా దర్శకురాలు అవా డూ వెర్నేను ఉత్తమ దర్శకుల జాబితాలో నామినేట్ చేయకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఇందుకు జాతి వివక్ష కారణం కాదా అంటే ఆస్కార్ బాధ్యులు జవాబు దాటేశారు.! పైగా ఈ చిత్రం కల్లోల పర్చే అంశాలు కలిగివుందని ఆ చిత్ర నిర్మాతల సంఘం 13వ రేటింగ్ ఇచ్చింది!

ఈ క్రమంలో బాగా కులీన వంశస్థురాలైన ఒక వృద్ధ వనిత అక్కడ దిగుతుంది. ఆమె స్వస్థలం వెళ్లిన తర్వాత కొద్ది కాలానికే మరణిస్తుంది. ఆ సమయంలో గుస్తావ్ హెచ్‌కు కబురు వస్తే జీరోను తీసుకుని వెళతాడు. ఆ వృద్ధ మహిళ 'బాయ్‌విత్‌ద ఆపిల్' అనే అత్యంత ఖరీదైన పెయింటింగును అతనికి చెందేలా రాసినట్టు తెలుస్తుంది. అయితే బంధువులు సందేహిస్తారు. చివరకు అతను జీరో సహాయంతో దాన్ని దొంగతనంగా తీసుకుని వచ్చేస్తాడు. బాగా లాభం పొందుతాడు. ఈ కథంతా 1968లో వచ్చిన రచయితకు జీరోనే చెబుతాడు. కొంత విచిత్రంగా వికృతంగా కనిపించే ఈ కథ పరోక్షంగా నాటి యూరోపియన్ వాతావరణాన్ని పై వర్గాల వారి జీవన రీతులను చిత్రిస్తుంది. గుస్తావ్ పాత్ర ప్రధానంగా వుంటుంది. దీనికి కూడా ముందుగానే చాలా అవార్డులు వచ్చాయి. అయితే ఎక్కువ మంది దీన్ని పెద్ద పోటీగా తీసుకోవడం లేదు. ఈ చిత్ర దర్శకుడు ఎస్.అండర్సన్

అమెరికన్ స్నైపర్

హాలివుడ్ నిర్మాణాలలోనూ ఆస్కార్ ఎంపికల్లోనూ అమెరికా విదేశాంగ విధానం చూపించే చిత్రాలు కొన్నయినా వుండితీరాలి. 2012లో అచ్చంగా ఇరాక్‌పై యుద్ధాన్ని చూపించిన చిత్రానికే అవార్డు దక్కింది. "అమెరికన్ స్నైపర్" కూడా ఆ కోవకు చెందిందే. కాకపోతే ఇది కూడా ఒక సైనికుడి వాస్తవ గాథగా ప్రచారం పొందింది. అతని పేరు క్రిస్‌కైల్. టెక్సాస్‌లో ఒక యువకుడు. అక్కడ అందరు కుర్రాళ్లలాగే తనుకూడా కౌబాయ్ కావాలని కలలు కంటుంటాడు. చివరకు నిజమైన వీరుడిలా పోరాడాలని నౌకాదళంలో చేరతాడు. టెర్రరిజంపై పోరాడటం లక్ష్యంగా భావిస్తాడు. ఆ క్రమంలోనే క్యోలోను పెళ్లి చేసుకుంటాడు. వీరంతా ఇరాక్‌పై దాడిలో పాల్గొంటారు. ఆ సందర్భంగానే వేలమంది ప్రాణాలు పోవడం చూస్తాడు. యుద్ధ బీభత్సం తిలకిస్తాడు. తమ లాటి స్నిపర్లు కొంచెం జాగ్రత్తగా వ్యవహరిస్తే ఎంతో మంది ప్రాణాలు రక్షించవచ్చునని తెలుసుకుంటాడు. ఈ సందర్భంగా యుద్ధం కలిగించే కష్టనష్టాలకు చాలా ఘర్షణకు గురవుతాడు. ప్రసిద్ధ నటుడు దర్శకుడు క్లింట్ ఈస్ట్‌వుడ్ నిర్మించిన ఈ చిత్రంలో హీరోగా నటించిన బ్రాడ్లీ కూపర్ ఉత్తమ నటుడి రేసులో వున్నాడు. గతంలోనూ ఈయన "అమెరికన్ హసిల్" (2013), "సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్" (2012) చిత్రాలకు నామినేషన్ పొందినా అవార్డు వరకూ రాలేదు. ఈసారి తప్పక ఆయనకు ఆస్కార్ దక్కుతుందనే అభిప్రాయముంది.

మరియన్

ఇమిటేషన్ గేమ్

ఈ చిత్రం కూడా యుద్ధ కాలానికి చరిత్రకూ సంబంధించిదే. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో శత్రు దేశ రహస్య సంకేతాలను ఛేదించడంలో విశేష ప్రజ్ఞ కనపర్చిన 'అలన్‌టూరింగ్' అనే గణిత శాస్త్రవేత్త కథ ఇది. 1942లో లండన్‌లోని బెట్చెలీ పార్కులో వారు పని చేస్తుంటారు. ఆ రోజుల్లో వారు పనిచేసిన తీరు ఇప్పటి వరకూ బ్రిటిష్ ప్రభుత్వం అతి రహస్యంగా వుంచింది. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదలయ్యాక అదంతా మారిపోయింది. ఆనాటి వైర్‌లెస్ సిబ్బంది బయటకు వచ్చి తామెలా పనిచేసింది వెల్లడిస్తున్నారు. కేంబ్రిడ్జిలోని ఒక మహిళ 72 ఏళ్ల తర్వాత తను చేసిన దాన్ని చెప్పుకోగలుగుతున్నానని ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో హీరోగా నటించిన బెనడిక్ట్ కంబర్‌బ్యాచ్ కూడా ఉత్తమ నటుడి రేసులో వున్నాడు.

హాకింగ్ కథతో ....

ఇప్పుడు పరంపరగా వస్తున్న జీవిత కథా చిత్రాల్లో ఒకటి "ద థియరీ ఆఫ్ ఎవరీ థింగ్" ఇది అంగవైకల్యాన్ని కూడా జయించి ఆశ్చర్యకరమైన వైజ్ఞానిక సత్యాలు ఆవిష్కరించిన స్టీఫెన్ హాకింగ్' జీవితం ఆధారంగా తయారైన కథ. ఇందులో ప్రధాన పాత్రధారి ఎడ్డీ రెడ్మేన్ ఆస్కార్ ఉత్తమ నటుడి రేసులో ప్రముఖ స్థానం ఆక్రమిస్తున్నాడు. ఇతను గతంలో ఒక మోడల్‌గా వుండేవాడు. మోటార్ న్యూరాన్ వ్యాధితో మాట కదలిక కష్టమై కంప్యూటర్ సాయంతో విద్యుత్ తరంగాల ద్వారా తన భావాలు వెల్లడించే హాకింగ్ పాత్రలో ఈయన జీవించాడనేది పరిశ్రమ వాక్కు. ఈయన తొలిసారి నామినేట్ అయ్యాడు గాని పాత్రను బట్టి ఎంపిక అవకాశాలు ఎక్కువనే అంటున్నారు.

ఫాక్స్ క్యాచర్

రకరకాల ప్రతిభలున్న వ్యక్తుల జీవితాలతో రూపొందిన చిత్రాల తరహాలో మరొకటి ఫాక్స్ క్యాచర్. జాన్ డూ పాంట్ అనే మహా సంపన్నుడి కథ. మల్లయుద్ధంలో ప్రవీణుడైన ఒక ఒలింపిక్ క్రీడాకారుణ్ని ఈయన తన ఇంట్లో వుంచి శిక్షణ ఇప్పిస్తాడు. అందరూ అభినందిస్తారు. అయితే అందుకో ప్రత్యేకమైన కారణం వుంటుంది. విలనిజం అనిపించే పాత్రలో స్టీవ్ కారెల్ అమోఘంగా నటించి అనేక పురస్కారాలు తెచ్చేసుకున్నాడు. ఇప్పుడు ఆస్కార్‌కు తొలిసారి నామినేట్ అయ్యాడు

ఎంపిక ఎలా? ఎవరిచే?

ఆస్కార్ అవార్డుల వేడుకలు విశ్వ వ్యాపితంగా ప్రసారమై కోట్లమందిని అలరిస్తాయి. ఆ తరుణంలో బహుమతి గ్రహీతల హావభావ విన్యాసాలు వినోద విభావరుల వివరాలు మీడియాలో నిండి పోతాయి. కాని దానికి ముందు చాలా తతంగమే నడుస్తుంది. దశల వారీ తతంగాలు సాగుతాయి. హాలివుడ్ మాతృభూమి అమెరికా అంతర్జాతీయ ప్రయోజనాలూ ప్రతిబింబిస్తాయి. ఇది తరతరాలుగా సాగుతున్న కథ. ఈ సారి ఎంపికలోనూ అవన్నీ చూడొచ్చు. ఏవో చెదురు మదురు సందర్భాలలో బలమైన కారణాలు తోసుకువస్తే తప్ప ఆస్కార్ ఆస్కారం ఏమిటో తిరాస్కారాలెందుకో పరిశీలకులు చెప్పేస్తుంటారు. ప్రపంచ వినోద పరిశ్రమకు కేంద్ర స్థానమైన హాలివుడ్ సూత్రాలు అంత

అమెరికా కోణానికే మొగ్గు?

మొదటి నుంచి అనుకుంటున్నట్టుగా ఈ సారి కూడా అమెరికా విదేశాంగ కోణానికే ఆస్కార్ అవార్డు ఎంపికలో ప్రాధాన్యత లభిస్తుందా అంటే తొలి కథనాలు అవుననే చెబుతున్నాయి. ఉదాహరణకు ఎంపిక ప్రక్రియలో ఓటు చేసే ఒక మహిళ మీడియాతో మాట్లాడుతూ చెప్పిన మాటలే ఈ అభిప్రాయం కలిగిస్తున్నాయి. 'సెల్మా' అనే చిత్రంలో అసలు కళ లేదని ఆమె తీసిపారేశారు. 'బాయ్‌హుడ్' కథ మొత్తం ఎగుడుదిగుళ్లతో వుందని, ప్రధాన పాత్రధారిపై అంచనాకు రాలేమని తేల్చారు. ఇక 'బర్డ్‌మ్యాన్' చాలా బావున్నా ఒక విఫల నటుడి మనోవేదనగా అదేమంత ఉల్లాసం కలిగించబోదన్నారు. ఇరాక్‌పై దాడిలో పాల్గొన్న సైనికుడి కథతో తీసిన అమెరికన్ స్నైపర్ ఈ కాలానికి ఏది కావాలో సరిగ్గా అందిస్తుందని కితాబునిచ్చారు. ఆ చిత్రం ఉత్తేజం కలిగిస్తుంది. 'బర్డ్‌మ్యాన్' ఇంత కాలం సాధించినదంతా ఆ చిత్రం చివరి వారంలోనే వూడ్చేసింది అని కూడా అన్నారు. కాకపోతే ఉత్తమ నటుడిగా మాత్రం 'బర్డ్‌మ్యాన్' హీరో మైకెల్ కెటాన్‌నే ఆమె మెచ్చుకున్నది. గ్రాండ్ బుడాపెస్ట్ హోటల్ గురించి కూడా సానుకూలంగానే స్పందించినా అత్యధిక ప్రశంసలు అమెరికన్ 'స్నైపర్‌కే ఇవ్వడం అంతిమ ఫలితానికి సంకేతమా అనే అభిప్రాయం వినిపిస్తున్నది. ఉత్తమ నటుడుగా 'థియరీ ఫర్ ఎవరీ థింగ్' నాయకుడు ఎడ్డీ రెడ్మాన్ పేరు ఎక్కువగా వినిపించినా వ్యతిరేక ప్రచారం కూడా ఈ వారం ముందుకొచ్చింది. ఒక సినిమాలో లోగడ ఆయన తక్కువ రకం పాత్ర ధరించడం ఈ సారి ఎంపికకు అవరోధం అవుతుందనేది ఈ కథనాల సారాంశం.

బలమైనవన్న మాట.

ఈ అవార్డు ఎంపిక కళాత్మక విలువలను బట్టి జరుగుతుందనుకుంటారు గాని ఓటింగును బట్టి తుది నిర్ణయం జరుగుతుందని చాలా మందికి తెలియదు. అధికారికంగా ఈ అవార్డు పేరు అకాడమీ అవార్డులు. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సభ్యులైన 5783 మంది ఓట్లు వేస్తారు. దానికి ముందు నామినేషన్ల పేరిట తొమ్మిది ఉత్తమ చిత్రాల జాబితా రూపొందిస్తారు. ప్రైజ్ వాటర్ కూపర్స్ అనే ఆడిటింగ్ సంస్థ (కుంభకోణాల్లో ఈ పేరు విన్నాం) ఓట్లను లెక్కించి ప్రకటిస్తుంది. అయితే ఈ వివరాలు గోప్యంగా వుంటాయి గాని ఒకసారి లాస్ ఏంజెల్స్ టైమ్స్ ప్రస్తుత వివరాలను సంపాదించి ప్రచురించింది. ఈ ఎంపిక చేసే ఓటర్లలో 94 శాతం మంది శ్వేతజాతీయులుంటారనీ, 77 శాతం పురుషులేనని పత్రిక వెల్లడించింది. గతంలో చాలా సార్లు జాతి వివక్షకు సంబంధించిన ఆరోపణలను ఎదుర్కొన్న ఆస్కార్ నేపథ్యం ఈ విధంగా బహిర్గతమైంది. రెండు శాతం మంది మాత్రమే నల్లజాతి వారు కాగా మరో రెండు శాతం మంది లాటిన్ అమెరికన్లట. 15 విభాగాల్లోనైతే అచ్చంగా శ్వేతజాతి పురుషులే వున్నారట. నల్లజాతి కళాకారుల పట్ల వివక్షకు నిరసనగా గతంలో కొంతమంది ప్రముఖులే ఈ కమిటీ నుంచి నిష్క్రమించారు కూడా.

ఆ సంగతి అలా వుంచితే అవార్డుల ఎంపికలోనూ కొన్ని రివాజులు ఏర్పడ్డాయి. ఇవి మిగిలిన చిత్రోత్సవాలకు భిన్నంగా వుంటాయి. ఉదాహరణకు కేన్స్‌ను తీసుకుంటే అక్కడ ప్రయోగవాదానికి పెద్ద పీట లభిస్తుంది. వెనిస్‌లో నవ్య వాస్తవిక వాదం ఆదరణ పొందుతుంది. బెర్లిన్‌లో వాస్తవిక చిత్రణకు పట్టం కడతారు. వీటన్నిటినీ హాలివుడ్ గమనిస్తూనే వుంటుంది. కాని వారి కొలబద్దలు వేరు. పురోగామి శీలత కన్నా యథాతథ స్థితిని గతావలోకనాన్ని ప్రతిబింబించే చిత్రాలకు అక్కడ పురస్కారాలు ఎక్కువగా దక్కుతాయి.


ఎడ్డీ రెడ్‌మ్యాన్

ఉదాహరణకు ఈ జాబితాలో చోటు సంపాదించిన "ఎక్స్‌ట్రీమ్లీ లౌడ్ అండ్ ఇన్ క్రెడిబుల్లీ క్లోజ్", "వార్ హార్స్", "ద హెల్ప్" వంటి చిత్రాలను తీసుకుంటే వాటి బాక్సాఫీసు విజయాలకు తోడు పాత చూపు కూడా కీలక పాత్ర వహించింది. గతంలో కూడా "షేక్స్‌పియర్ ఇన్ లవ్", "గ్లాడియేటర్", "లార్డ్ ఆఫ్ రింగ్స్", "రిటర్న్ ఆఫ్ ద కింగ్", "స్లమ్ డాగ్ మిలియనీర్" వంటి చిత్రాలన్నీ పురస్కారాలు పొందాయి. ఇవన్నీ అర్థమైనవా కాదా అనే ప్రశ్న పక్కన పెడితే వీటిలో ఏదీ భవిష్యత్తుకు సంబంధించిన చైతన్యం ఇచ్చేది కాదు. అవార్డుతో వాటిని ఆకాశానికెత్తడమే జరిగింది. "మిలియన్ డాలర్ బేబీ", "హర్ట్ లాకర్" వంటి చిత్రాలు ఎప్పుడైనా మన్నన పొందాయంటే తమకూ కొన్ని విభిన్న విలువలున్నాయని చెప్పుకోవడానికి మాత్రమేనన్నది విమర్శకుల విశ్లేషణ. ఈ సారి 'బయోపిక్స్' అనబడే జీవిత కథా చిత్రాలు అధికంగా తీసుకుంటున్నారు. వారి వారి జీవితాల పరిధిలో పెద్దగా రాజకీయ సందేశాలు సంఘర్షణలు చెప్పే అవకాశం అవసరం కూడా వుండదు. వారి జయాపజయాలు ఎలాగూ హృద్యంగా వుండి ప్రేక్షకులను అలరిస్తాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రపంచంలో వాణిజ్య చిత్రాలకు మాతృసంస్థ వంటి హాలివుడ్ మూల సూత్రాలే వేరు. అవి సినిమా వయస్సు ఎంతో అంత పెద్ద వీక్షకులను మంత్ర ముగ్ధులను చేసి ఏవేవో కాల్పనిక లోకాల లోలోపలకి తీసుకుపోవడమే లాస్ ఏంజెల్స్ రహస్యం. వారి ఎంపికలు ఆ ప్రకారమే వుంటాయి. ఇప్పుడైనా.. ఎప్పుడైనా.. వీటిమీద విమర్శలు ఎన్ని వచ్చినా మార్పులకు ఆస్కారం వుండదంతే! ✦

అంతా శ్వేత మయం!

87వ ఆస్కార్ అవార్డుల ఉత్సవంపై ఉత్కంఠ నెలకొంది. అయితే అదే సమయంలో ఉదాసీనత కూడా వుంది. ఏమంటే ఈ సారి అంత గొప్ప ప్రయోగాలు లేవన్నది ఒక భావన. ఇక అంతకంటే ముఖ్యంగా వైవిధ్యం లోపం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఈ సారి నామినేషన్లు పొందిన నటీనటులు దర్శకులు సాంకేతిక నిపుణులు అంతా తెల్లవారే కావడంతో పురుషులే వుండటం ఇందుకు కారణం. అంతా తెల్లపురుషుల పురాణమేనని మీడియాలో విమర్శలు వచ్చాయి. అందులోనూ అమెరికాలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనల తర్వాత వర్ణాధిక్యతపై నిరసన పెరిగింది. అలాంటి ఇతివృత్తాలను గాని కళాకారులను గాని నామకార్థంగానైనా ఎంపిక చేయని ఏకపక్ష ధోరణి సమంజసం కాదని గార్డియన్ పత్రిక రాసింది. 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత పాక్షికత్వం ఈ సారి కనిపించిందని వ్యాఖ్యలు వచ్చాయి. ఈ విమర్శల ధాటికి జడిసి ఆస్కార్ నిర్వాహక సంస్థ సమాధానం వంటి సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అధ్యక్షుడు చెరీ బూన్ ఇసాక్స్ మాట్లాడుతూ గత రెండేళ్లలోనూ వివిధ తరగతుల ప్రాతినిధ్యం కోసం తాము ప్రత్యేకంగా కృషి చేశామని చెప్పుకున్నారు. ఈ నామినేషన్ల ఎంపిక ప్రక్రియ అనేక కొలబద్దలతో వివిధ విభాగాల నిపుణులద్వారా జరుగుతుంది. ఇంకా వైవిధ్యం వుంటే నేనూ ఆహ్వానిస్తాను అని ఆమె చెప్పారు. అయితే ఎంపికైనవారంతా శ్వేతజాతీయులే కావడం మీకు ఇబ్బందిగా లేదా అంటే వారంతా అర్హులే అంటూ దాటేశారు.

ప్రేమ... విప్లవం...

(భాగం -25)

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

పొగమంచు దట్టంగా అలుముకుని, సూర్యుడు కనిపించని కాలంలో లండన్‌కు చేరుకున్నారు మార్క్స్ దంపతులు. మిట్ట మధ్యాహ్నం కూడా చీకటిగా వుంటుంది. వీధుల్లో అక్కడక్కడా పచ్చటి గ్యాస్‌లైట్లు వెలుగుతుంటాయి. లేదా, డబ్బులిస్తే, పిల్లలు లాంతర్లతో కాసేపు దారి చూపుతారు. "పొగమంచు ఎలా వుందంటే. మీరో మనిషితో కరచాలనం చేసినా అతని ముఖం మాత్రం చూడలేరు". ఈ పగటి చీకటికి తోడు భరించలేని దుర్గంధం.

బళ్లు లాగటానికి వేలాది గుర్రాలు లండన్ వీధుల్లో తిరుగుతుంటాయి. సహజంగానే వందల టన్నుల పేడ కూడా పేరుకుపోతుంటుంది. భవనాల్లోకి సెల్లార్లలోకి వీళ్లు వదిలిన మలమూత్రాలు కూడా వీధుల్లోకే వచ్చి చేరతాయి. జనసాంద్రత ఎక్కువగా వున్న లెస్టెండ్, సోహెూ వంటి ప్రదేశాల్లోని మరుగుదొడ్లలో మూడు అడుగుల పాటు పేరుకుపోయి వుంటాయి వ్యర్థాలు. జెన్నీ లండన్‌కు చేరిన సమయంలో ఈ వ్యర్థాలను థేమ్స్ నదిలోకి వదలటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాని దీనివల్ల సమస్య తీరలేదు సరికదా మరింత జటిలమైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పోవటం వల్ల, ప్రతిసారీ ఆటుపోటులతో పాటు మురికి వీధుల్లోకి ప్రవహించాలి. దీని వల్ల వ్యాపించింది దుర్గంధమే కాదు, వ్యాధులు కూడా. పైగా లెస్టర్ స్క్వేర్, సోహెూలలో వుండేది నిరుపేదలే, కలుగుల్లో ఎలుకల్లా.

1845 తర్వాత, బంగాళా దుంప తెగులు ఫలితంగా కలిగిన ఆర్థిక సంక్షోభంతో వలసవచ్చిన వేలాది మంది శరణార్థులు లెస్టెండ్, సోహెూలలోనే తలదాచుకున్నారు. దేశదేశాల నుండి వచ్చిన వారితో ఇక్కడ చిన్న చిన్న ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఐరిష్ కాలనీలు ఏర్పడ్డాయి. అక్కడ ఎవరూ ఇంగ్లీషు మాట్లాడవలసిన అవసరం లేదు. తమదేశ సంప్రదాయాలనే పాటించవచ్చు. అయితే, అక్కడ కూడా, పాతవాళ్లు కొత్తగా వచ్చినవాళ్లను దోపిడీ చేస్తారు. ఎక్కువ అద్దెలు డిమాండ్ చేస్తారు. వెంట తెచ్చుకున్నది కొద్దోగొప్పో ఏమైనా వుంటే కాజేస్తారు. అలా, కొత్తగా వచ్చిన శరణార్థులు రోడ్డునపడ్డారు. కాని లండన్ వీధులు ఎంత రద్దీగా వుంటాయంటే, అడ్డం వచ్చిన వాళ్లను లాక్కుంటూనైనా ముందుకు పోతారు గాని నడక వేగం తగ్గించరెవరూ. చివరికి సందుల్లో, గొందుల్లో, ఎక్కడ కాసింత చోటు దొరికితే అక్కడ తలదాచుకోవటంతో చివరికి ఆ సందులు, గొందులు కూడా నగరంలోని మరో నగరంగా మారాయి. అక్కడ లండన్‌తో సంబంధం వుండదు. వాళ్ల చట్టాలు వాళ్లవే. వాళ్లే న్యాయం చెప్పుకుంటారు.

"1849, నవంబర్ 5నాడు జరిగింది జననం. ఆ రోజు గైఫాక్స్ డే. నగరమంతా టపాకాయల మోతలతో, వెలుగులతో పండగ చేసుకున్నది. (గైపాక్స్ 1570-1606. గుయిడో ఫాక్స్ అని కూడా పిలుస్తారు. అతడు రాజుకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు విఫలమైంది). తమ నాల్గవ సంతానానికి హైన్రిష్ గుయిడో మార్క్స్ అని నామకరణం చేశారు మార్క్స్ దంపతులు. ఆ తిరుగు బాటుదారు గౌరవార్థం కొడుకును ఫాక్స్‌చెన్ అని పిలిచారు."

సహజంగానే, లెస్టర్ స్క్వేర్‌లో వందలాది మద్య శాలలు వెలిశాయి. జేబులో షిల్లింగు వున్న అదృష్టవంతుడికి అక్కడో గ్లాసు 'మనశ్శాంతి' దొరుకుతుంది. కాని పాముల్లా మెలికలు తిరిగిన ఆ సందులు, చీకటి సొరంగాల్లాంటి మద్యశాలలు ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఆ సందుల్లో బంగాళాదుంపలు, కాఫీ, వేయించిన చేపలు, బఠానీ సూపు, మిఠాయి, రకరకాల పళ్లు, కాయలు అమ్ముతారు. బూతు పుస్తకాలు అమ్మేవాళ్లు అందులో వున్నది లేనిది కల్పించి జనాన్ని ఆకర్షిస్తారు. కవులూ, నాటకాలు రాసేవాళ్లూ, జాలిగొలిపేటట్టుగా తమ కావ్యాలు

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

గానం చేస్తూ చేతులు జాస్తారు. ముఖ్యంగా ఇటాలియన్ కుర్రాళ్లు వీళ్లందర్నీ మించిపోయారు. ఓ కోతినో, ఎలుకనో పట్టుకొని ఆడిస్తూ ఇటాలియన్ సంగీతకారుల్ని అనుకరిస్తూ పాడి డబ్బులడుక్కుంటారు. ఈ డబ్బులన్నీ వాళ్ల గ్యాంగ్ లీడర్‌కిస్తే తప్ప వాళ్లు క్షేమంగా బతకలేరు.

లెస్టర్‌స్క్వేర్‌లో ఇదీ జెన్నీ చుట్టూ

వున్న వాతావరణం. అందరూ ముష్టివాళ్లే. ఆకలికో, ఆ హింసలు భరించలేకనో పిచ్చెక్కి అరుస్తున్నారు కొందరు. అది జీవిత సమరాంగణం. అదే ఆమె కొత్త నివాసం.

దేశాంతర వాసానికి వచ్చిన అనేకమంది లాగా, మార్క్స్ కూడా ఉత్సాహంగా పొంగిపోతున్నాడు. గత సంవత్సరం జరిగిన ఆందోళనలు, తిరుగుబాట్లు, విప్లవాలు యూరోపు ముఖ చిత్రాన్నే మార్చివేశాయి. రాజులు, ధనమదాంధుల కారణంగా విప్లవం వీగిపోయినందుకు ఆయనపై పట్టుదల పెరిగిందే తప్ప ఇసుమంతైనా తగ్గలేదు. పరాజయంతో, మధ్యతరగతి కొద్దిగా లాభపడింది. వ్యాపారస్తులకు తాయిలాలు లభించాయి గాని కార్మికుల స్థితి కనాకష్టంగా మారింది. ఫ్యాక్టరీలతో వస్తువులను ఉత్పత్తి చేసి యజమానులకు లాభాలార్జించి పెడుతున్న చేతులు హక్కుల సాధనలో మాత్రం నిర్వీర్యమవుతున్నాయి. రాజకీయ అధికారం లేదు గనుక కార్మికుడి ఉనికినే ఎవరూ గుర్తించరు. గుర్తిస్తే "వ్యవస్థకే అతడో ప్రమాదకరమైన వ్యక్తి. తిరుగుబాట్లు చేస్తాడు. బారికేడ్లు నిర్మిస్తాడు" అంటారు.

తను ప్రారంభించిన పోరాటానికి హేతుబద్ధమైన ముగింపు సాధించటానికే ప్రయత్నించాడు మార్క్స్. మరో తిరుగుబాటు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈసారి, తిరుగుబాటుకు నాయకత్వం వహించేది పెటీ బూర్జువా వర్గం, చిన్న దుకాణదార్లు, వ్యాపారుస్తులు, చిరుద్యోగులు వగైరా... బడా బూర్జువా వర్గం వీళ్లను దారుణంగా దోచుకుంటున్నది. మొన్నటి విప్లవ పరాజయంతో లాభపడింది తిమింగలాలే తప్ప చిన్న చేపలు కాదు. తిరుగుబాటు చేసే క్రమంలో పెటీబూర్జువాలు, కార్మికుల సహాయం

" సహజంగానే, లెస్టర్ స్క్వేర్‌లో వందలాది మద్య శాలలు వెలిశాయి. జేబులో షిల్లింగు వున్న అదృష్టవంతుడికి అక్కడో గ్లాసు 'మనశ్శాంతి' దొరుకుతుంది. కాని పాములా మెలికలు తిరిగిన ఆ సందులు, చీకటి సొరంగాల్లాంటి మద్యశాలలు ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఆ సందుల్లో బంగాళాదుంపలు, కాఫీ, వేయించిన చేపలు, బఠానీ సూపు, మిఠాయి, రకరకాల పళ్లు, కాయలు అమ్ముతారు. బూతు పుస్తకాలు అమ్మేవాళ్లు అందులో వున్నది లేనిది కల్పించి జనాన్ని ఆకర్షిస్తారు. "

హైన్రిష్ గుయిడో మార్క్స్

తీసుకుంటారు. ఇద్దరూ కలిస్తేనే తప్ప అధికార వర్గాన్ని బంధించటం సాధ్యంకాదు. ఇవి అనివార్యం. కాని ఈ కలయిక తాత్కాలికమే. "మా లక్ష్యం ప్రైవేటు ఆస్తులు చేతులు మారటం కాదు. ప్రైవేటు ఆస్తి రద్దు కావాలి. వైషమ్యాలు తొలగి వర్గసామరస్యం సాధించటం కాదు. వర్గరహిత సమాజం కావాలి. ప్రస్తుత సమాజానికి మెరుగులు దిద్దటం కాదు. దీని పునాదుల మీద కొత్త సమాజం ఆవిర్భవించాలి".

కాని, ఇంగ్లండులో వుంటూ యూరోప్‌లోని కార్మికులను సమాయత్తం చెయ్యటమెలా? అక్కడ సామాజిక భూకంపం సృష్టించటమెలా? ఈ పనికోసం ఒక సంస్థ, ఒక పత్రిక అవసరముంటుంది. కార్మికుల్లో నమ్మకం పెంచటానికి ఒక కార్యక్రమం రూపొందించాలి. అలా మార్క్స్ మళ్లీ రాజకీయ కార్యక్రమాలు ప్రారంభించాడు. పాత కమ్యూనిస్టు లీగ్‌తో సంబంధాలు పునరుద్ధరించుకున్నాడు. "శరణార్థుల సహాయ కమిటీ" పేర ఒక సంస్థను ప్రారంభించటానికి సహాయం చేశాడు. అయితే మార్క్స్ మనసంతా పత్రిక మీదే వుంది. ఎనభై పేజీలతో జర్మన్ మాస పత్రిక ప్రారంభించి, దాన్ని క్రమంగా వారపత్రికగా, దినపత్రికగా మార్చాలి. యూరోపులో దీనికి బాగా ప్రచారం లభిస్తుంది. అంతకన్నా ముఖ్యంగా, 'శత్రు దేశం జర్మనీ' లో అందరూ చదువుతారు. లండన్ నుండి స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తపరచటం ద్వారా, యూరోపులోని రియాక్షనరీ ప్రభుత్వాల మీద ఒత్తిడి పెరుగుతుంది. స్థానికంగా నిరసన తెలపలేని వాళ్ల చేతిలో ఆయుధంగా మారుతుంది.

అయితే తన దగ్గర, లీగ్ సభ్యుల వద్ద పత్రిక కోసం పెట్టుబడి పెట్టగలిగినంత డబ్బులేదు. అందరూ తనలాగే శరణార్థులు. కాని ఎలాగోలా దొరక్కపోతుందా అని ఆశ. పత్రిక ప్రారంభించటమంటూ జరిగితే, తొలి రోజులే కాస్త ఇబ్బందిగా వుంటాయి. ఈ లోగా జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కోసం "బూర్జువా ఆస్తి అంటే ఏమిటి?" అనబడే ఉపన్యాసాల పరంపర ప్రారంభించాడు. ఈ ఉపన్యాసాలు జనాన్ని బాగా ఆకట్టుకుంటే వాటినే పత్రికలో పునర్ముద్రించవచ్చు.

ముప్ఫైరెండేళ్లొచ్చాయి. సరిగ్గా యూనివర్సిటీ ప్రొఫెసర్‌లాగే ఉన్నాడిప్పుడు. మోకాళ్ల దాకా లాంగ్‌కోట్ వేసుకుంటాడు. మెడలో స్కార్ఫ్. దువ్వని నల్లని జుత్తు, అక్కడక్కడా నెరుస్తున్నది గడ్డం. కళ్లద్దాలు లేవుగాని కుడికంటిలో లెన్సు పెట్టుకుంటాడు. ఓపిగ్గా బ్లాక్‌బోర్డు మీద రాస్తూ ఫార్ములాలను, సిద్ధాంతాలను వివరిస్తాడు. భవిష్యత్తులో, పెట్టుబడిగా అందరికీ తెలిసిన మహాగ్రంథానికి పేరుస్తున్న ఇటుకలవి. ఆయన విద్యార్థులంతా సహచరులే, కాకపోతే వయసులో కొద్దిగా చిన్నవాళ్లు. అందరూ వృత్తిపనివాళ్లు. మేధావులు సభ్యత్వ నమోదుకు లీగ్ ఆశించిన 'కార్మికులు' కాదు. వీళ్లంతా కొత్తగా వచ్చిన శరణార్థుల్లో దండిగా వున్నారు. మధ్యాహ్నమంతా నగరంలో వీధివీధికీ తిరిగి విరాళాలు పొగుచేసి, ఎంతోకొంత సహాయం చేసి వాళ్ల నమ్మకం పొందటానికి ప్రయత్నించాడు మార్క్స్.

అయితే, ఆ సమయంలో విరాళాల సేకరణలో కూడా పోటీ తీవ్రంగా వుంది. 1848లో డజన్ల కొద్దీ నాయకులు శరణార్థులకోసం పాటుపడతామన్నారు. అందరికీ విరాళాలు కావాలి. పరువు ప్రతిష్ఠలు కావాలి. రాజకీయ అధికారం కావాలి. ఈ వ్యవహారాల్లో జర్మన్‌లకు పట్టపగ్గాలేవు. తమతో తాము కలహించుకుంటారు. ఇతర్లతోనూ పోట్లాడతారు.

ఈ ఫ్యాక్షన్ నాయకులందరూ తమను తాము రాబోయే విప్లవానికి నాయకులుగా వూహించుకున్నారు. ఎవరికి వాళ్లే కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలు రచించారు. గుర్తింపు కోసం తాత్కాలిక ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వమంటూ వున్న విషయం వాళ్లకు తప్ప మరెవరికీ తెలియదు. వీళ్లంతా శరణార్థులకు సాయం చెయ్యాలనుకోవటంలో సేవాదృక్పథమెంతుందో, అధికారదాహం అంతకంటే ఎక్కువుంది.

మార్క్స్, తనను తాను ఈ ఫ్యాక్షన్ నాయకులలో ఒకడిగా ఎప్పుడూ భావించలేదు.



ఆగస్ట్ విల్లిచ్

"మద్యశాలలో కూర్చుని గ్లాసులు ఖాళీచేస్తూ తమ చుట్టూ ఉన్నవాళ్లే తమ మంత్రి వర్గమని కలలుకనే ప్రజాస్వామిక నియంతలు వీళ్లు" అన్నాడు వ్యంగ్యంగా. మార్క్స్‌ను ఎంతమంది ఎన్నిసార్లు 'నియంత' అని ఆరోపించినా, ఆయనకెప్పుడూ ఏ దేశానికీ అధినేత కావాలనే కోరిక లేదు. జనమంతా తనకు జేజేలు కొట్టాలనుకోలేదు. "బుర్రలేని మనుషులు. వీళ్లకున్నదంతా అధికార వర్గ భావజాలమే" అన్నది ఆయన అభిప్రాయం. కాని వాళ్లకు బోధించటానికి మాత్రం ప్రయత్నించాడు. చరిత్ర గతి గురించిన తన అవగాహన సరైనదైతే "వీళ్లు రాబోయే రోజులకు ప్రతినిధులు". జ్ఞానాన్ని పెంచుకుని, చైతన్యవంతలైన జనం, తమ సంఖ్యాబలంతో అధికార వర్గాలను చిత్తుగా ఓడించగలరు. వేలాదిగా తరలివచ్చిన ఈ శరణార్థుల వంటి కార్మికులే సమసమాజాన్ని, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించగలరు. ఈ క్షణాన వాళ్లక్కావలసింది సిద్ధాంతం కాదు. తిండి తినటానికి కొద్దో గొప్పో దొరికిన వాడికే కలలు కనే శక్తి వుంటుంది. ఇంగ్లండులో ఉన్న శరణార్థులకు తోచిన సాయం చెయ్యమని జర్మనీలో వున్న దాతలకోసం ఒక అప్పీలు తయారు చేసి పంచింది మార్క్స్ బృందం.

"ఎప్పుడేమవుతుందో, ఎటుపోవాలో తెలియని పరిస్థితిలో వున్నారు. రాజకీయంగా ఎవరు ఏదైనా లిబరల్, డెమోక్రాట్, రిపబ్లికన్ లేదా సోషలిస్టు అందరూ ఇక్కడ శరణార్థులే. అందరూ దినదిన గండంగా గడుపుతున్న వాళ్లే. చింకిపాతల్లో, దేశంలోని సగం జనాభా విదేశీ గడ్డ మీద ముష్టెత్తుకుంటున్నారు. ఈ దివ్య భవ్య నగరం లండన్ పేవ్‌మెంట్ల మీద చలికి గడ్డకట్టుకుపోతూ కనిపిస్తారు మన సోదరులు. ఈ నగరంలోని ప్రతి వీధి జర్మన్‌ల ఆర్తనాదాలతో మార్మోగుతున్నది".

కమిటీ సభ్యులెవరూ విరాళాల్ని సొంతానికి వాడుకోరనీ, ప్రతినెలా ఖర్చులలెక్కలు ప్రచురిస్తామనీ వాగ్దానం చేశారు. నవంబర్ రెండో వారానికల్లా 14 కుటుంబాలకు సహాయం చెయ్యగలగినంత డబ్బుపోగైంది. మరో అరవై కుటుంబాలు కమిటీ సహాయం మీదే ఆధారపడి వున్నాయి. త్వరలో ఆ సంఖ్య 500కు పెరుగుతుంది. కమిటీ వాళ్లు ఒక సమిష్టి లాడ్జింగ్, భోజనశాల కూడా సోహెూలో ఏర్పాటు చేశారు. వృత్తి పనివాళ్లు కోసం ఒక వర్క్‌షాపు కూడా నిర్వహించారు.

శరణార్థులను ఆదుకోవటానికి త్వరలో మార్క్స్ చుట్టూ వీర్త్, రెడ్‌వుల్ఫ్, కార్లబ్లైండ్, కమ్యూనిస్ట్ లీగ్‌కు చెందిన హైన్రిష్ బార్, ఆగస్ట్‌విల్లిచ్‌లతో ఒక గ్రూపు ఏర్పడింది. ఎప్పటిలాగే జెన్నీ సెక్రటరీ బాధ్యతలు నిర్వర్తించాలి. త్వరలో ఎంగెల్స్ కూడా వచ్చి చేరతాడు.

మార్క్స్ దంపతులు కొలోన్ వదిలినప్పటి నుండీ, ఎంగెల్స్ ఉత్తరాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అతడు బేడెన్ యుద్ధంలో పాల్గొంటున్నాడు (విల్లిచ్ నాయకత్వంలో పనిచేస్తున్న సుమారు ఎనిమిది వందల మంది స్వచ్ఛంద సైనికులు మీద ఆజమాయిషీ చేస్తున్నాడు.

బేడెన్‌లోని తిరుగుబాటు దారుల సంఖ్య 6000–13000 మధ్య వుంటుంది. వాళ్లు 60,000 మంది ప్రష్యన్, బవేరియస్ సైనికులను ఎదిరించాలి. యుద్ధంలో కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు మాల్ హతుడైన తర్వాత, ఎంగెల్స్ స్విట్జర్లాండులోకి ప్రవేశించి. జెనీవాకు వెళ్లి ఇటలీ సరిహద్దులు దాటి సముద్ర మార్గంలో, జిబ్రాల్టర్ ద్వారా ఇంగ్లండులోకి ప్రవేశించాడు.

జెన్నీ ఆగమనం తర్వాత, కొద్ది కాలం పాటే లెస్టర్‌స్క్వేర్‌లో గడిపాడు మార్క్స్. ఇంగ్లీషు మాట్లాడే మిత్రుల సాయంతో చెల్సీలోని కింగ్స్‌రోడ్‌లో రెండుగదుల అపార్ట్‌మెంటొకటి దొరికింది. అక్కడున్న వాళ్లంతా మార్క్స్‌లాగే శరణార్థులు. అయినా సోహో కన్నా మెరుగైన చోటే. ఇక్కడికి రావటం వల్ల కనీసం జెన్నీకి మరో కొడుకును కనటానికి ప్రైవసీ దొరికింది.

1849, నవంబర్ 5నాడు జరిగింది జననం. ఆ రోజు గైఫాక్స్ డే. నగరమంతా టపాకాయల మోతలతో, వెలుగులతో పండగ చేసుకున్నది. (గైపాక్స్ 1570–1606. గుయిడో ఫాక్స్ అని కూడా పిలుస్తారు. అతడు రాజుకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు విఫలమైంది). తమ నాల్గవ సంతానానికి హైన్రిష్ గుయిడో మార్క్స్ అని నామకరణం చేశారు మార్క్స్ దంపతులు. ఆ తిరుగుబాటుదారు గౌరవార్థం కొడుకును ఫాక్స్‌చెన్ అని పిలిచారు. ఇదంతా బాగానే వుంది కాని మొదటి నుండీ ఈ కుర్రాడు అనారోగ్య పీడితుడే. పాలదాయిని పెట్టుకోవటానికి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవటంతో జెన్నీ స్వయంగా పాలివ్వాల్సి వచ్చింది. రాత్రింబవళ్లు ఏదో బాధతో ఏడుస్తూనే వున్నాడు పిల్లాడు. "నా పాలతో పాటే నా బాధలూ, దు:ఖమూ వాడు పంచుకున్నాడు" అంది జెన్నీ. "మార్క్స్ ఇంట్లోకి ప్రవేశించిన ఈ బుల్లి కమ్యూనిస్టు తన ఏడుపుతో ఎవరికీ నిద్ర లేకుండా చేశాడు" అన్నాడొక సన్నిహితుడు. ఏమీ చెయ్యలేని నిస్సహాయంతో రోజురోజుకూ బలహీనపడుతున్న కొడుకును దిగులుగా చూసింది జెన్నీ.

గుయిడో పుట్టిన వారం రోజులకు నవంబర్ 12 నాడు లండన్ చేరుకున్నాడు ఎంగెల్స్. అతని రాకతో మార్క్స్‌కు ధైర్యమొచ్చింది. శరణార్థుల కమిటీ నుండి పెటీబూర్జువాలను తొలగించాడు. వాళ్లతో కలిసి పనిచెయ్యటం తనకేమాత్రం ఇష్టం లేదు. 1848 విప్లవానికి వాళ్లు చేసిన ద్రోహం ఎప్పుడూ మరిచిపోలేడు. శరణార్థుల ప్రయోజనం కోసం అందరి సహకారం అవసరమే అయినా ఆ ద్రోహుల పొడే తనకు గిట్టదు.

అయితే పత్రిక విషయంలో ఆయనకిలాంటి పట్టింపులేమీ లేవు. 500 పౌండ్లు పెట్టుబడి పెట్టగలిగిన సంపన్నుడి కోసం నిరీక్షించాడు. "చివరికి సైతానుతోనైనా, రాజకీయాల్లో ఎవరితోనైనా కలిసి పనిచేయవచ్చు. కాకపోతే మనం వాడి వలలో పడకుండా. వాడు మన వలలో పడేటట్టు జాగ్రత్తపడాలి" అంటాడొక చోట. ఎవరు పెట్టుబడి పెట్టినా, తను రాయదలచుకున్నదే రాస్తానని గట్టి నమ్మకం.

"ముప్పైరెండేళ్లొచ్చాయి. సరిగ్గా యూనివర్సిటీ ప్రొఫెసర్‌లాగే ఉన్నాడిప్పుడు. మోకాళ్ల దాకా లాంగ్‌కోట్ వేసుకుంటాడు. మెడలో స్కార్ఫ్. దువ్వని నల్లని జుత్తు, అక్కడక్కడా నెరుస్తున్నది గడ్డం. కళ్లద్దాలు లేవుగాని కుడికంటిలో లెన్సు పెట్టుకుంటాడు. ఓపిగ్గా బ్లాక్‌బోర్డు మీద రాస్తూ ఫార్ములాలను, సిద్ధాంతాలను వివరిస్తాడు. భవిష్యత్తులో, పెట్టుబడిగా అందరికీ తెలిసిన మహాగ్రంథానికి పేరుస్తున్న ఇటుకలవి. ఆయన విద్యార్థులంతా సహచరులే, కాకపోతే వయసులో కొద్దిగా చిన్నవాళ్లు."

సశేషం

ఫోన్: 91776 18708

మిగిలిన అన్నంతో రుచులు

మిగిలిపోయిన అన్నాన్ని పారేయలేము. అలాగని రోజూ పులిహోర చేసుకొని తినలేము. అందుకే కాస్త కొత్తగా మిగిలిన అన్నంతో రకరకాల రుచులు చేసుకోవచ్చు అవేంటో తెలుసుకుందామా ....

రైస్ బుల్లెట్లు

కావాల్సినవి: అన్నం రెండుకప్పులు, సన్నగా పొడుగ్గా తరిగిన ఉల్లిపాయ ముక్కలు అరకప్పు, క్యాప్సికం, వెనిగర్, ఐదారు చుక్కలు, సోయాసాస్ చెంచా, వెల్లుల్లి ముక్కలు ముక్కలు చెంచా, ఉప్పు తగినంత, నువ్వులు పావుకప్పు, నూనె వేయించడానికి సరిపడా.

తయారీ: ముందుగా బాణలీలో రెండు చెంచాల నూనె వేడిచేసి వెల్లుల్లి ముక్కలు వేయించాలి. తరవాత ఉల్లిపాయ క్యాప్సికం, క్యాబేజీ ముక్కల్ని వేయాలి. అవి బాగా వేగాక వెనిగర్ సోయాసాస్, తగినంత ఉప్పు వేసి కలిపి పొయి కట్టేయాలి. ఇప్పుడు ఓ గిన్నెలో అన్నం తీసుకొని మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని కొద్దిగా చేతిలోకి తీసుకుని చిన్న చపాతీలా చేసుకోవాలి. మధ్యలో ముందుగా చేసుకున్న కూర మిశ్రమాన్ని ఉంచి మడతపెట్టి అంచుల్ని తడిచేత్తో మూసేయాలి. ఇలా మిగిలిన అన్నాన్ని కూడా చేసుకుని నువ్వులు అద్ది కాగుతోన్న నూనెలో వేయించుకోవాలి. వీటిని వేడివేడిగా సాస్ లేదా పుదీనా చట్నీతో కలిపి తింటే రుచిగా ఉంటాయి.

టెక్కీ

కావాల్సినవి : అన్నం కప్పు, ఉల్లిపాయ ముక్కలు అరకప్పు, కరివేపాకు ఆకులు పావుకప్పు, గసగసాలు పెద్దచెంచా, అల్లంవెల్లుల్లి మిశ్రమం చెంచా, పచ్చిమిర్చి నాలుగైదు, సెనగపిండి తగినంత, నూనె వేయించడానికి సరిపడా

తయారీ : ఓ గిన్నెలో అన్నం తీసుకుని వీలైనంత మెత్తగా చేసుకోవాలి. అందులో జీడిపప్పు ముక్కలతో సహా మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. మరీ పొడిగా ఉంటే కొన్ని నీళ్లు చల్లుకోవచ్చు. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని టిక్కీల్లా అద్దుకుని కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకోవాలి. ఇవి వేడివేడిగా తింటేనే బాగుంటాయి.

రైసిమియా

కావాల్సినవి: అన్నం కప్పు, కొబ్బరిపాలు కప్పు, సేమియా అరకప్పు, పాలు మూడుకప్పులు, బెల్లం అరకప్పు, ఐసు ముక్కలు కొన్ని ఉడికించిన రాజ్మా అరకప్పు, కుంకుమపువ్వు చిటికెడు (అవసరమైతే వేసుకోవచ్చు) జీడిపప్పు, బాదం ముక్కలు పావుకప్పు.

తయారీ : కొబ్బరిపాలలో అన్నం వేసి పొయ్యిమీద పెట్టాలి. పాలు ఉడికి అన్నానికి పట్టే వరకూ సేమియా వేసి పొయ్యిమీద పెట్టాలి. సేమియా ఉడికాక కాస్త కుంకుమపువ్వు వేసి దింపేసి ఫ్రీజ్‌లో ఉంచాలి. ఇప్పుడు బెల్లం తురిమి చాలా కొద్దిగా నీళ్లుపోసి పొయ్యిమీద పెట్టి, ముదురు పాకం వచ్చాక దింపేయాలి. ఇప్పుడు పొడవాటి గ్లాస్ తీసుకుని అందులో పావు వంతు ఐసు ముక్కలు వేసుకోవాలి. వాటిపైన టేబుల్ స్పూను ఫ్రిజ్‌లో ఉంచిన అన్నం. టేబుల్ స్పూను బెల్లం పాకం వేసుకోవాలి. దానిపైన టేబుల్ స్పూను ఫ్రిజ్‌లో ఉంచిన అన్నం. టేబుల్ స్పూను బెల్లం పాకం వేసుకోవాలి. దానిపైన చెంచా రాజ్మా చివరగా సేమియా వేసుకుంటే రైసిమియా రెడీ. వడ్డించే ముందు జీడిపప్పు, బాదం ముక్కల్ని చల్లుకుని చల్లచల్లగా తింటే చాలా రుచిగా ఉంటుంది.

సుడోకు

	1			4	6
	5		1		3
1	4			5	
2		5	4		
				6	
6	2		3	1	

అడ్డంగా, నిలువుగా ఉన్న ఈ ఆరుగళ్లలో ఒకటి నుండి ఆరు అంకెలు ఉండాలి. కానీ కొన్ని మిస్సయ్యాయి. అయితే వాటిని మీరు పూరించండి. కాని ఒకే వరుసలో నిలువుగా కానీ, అడ్డంగా కానీ వచ్చిన అంకె మళ్లీ రాకూడని మాత్రం మర్చిపోకండి

బొమ్మల నీడ ఎక్కడ?

కింది ఉన్న బొమ్మల నీడ పైన వాటి పై నున్న పెట్టెల్లో ఉండిపోయాయి. మరి ఏ బొమ్మ నీడ ఏదో గుర్తుపట్టండి చూద్దాం.



బొమ్మ గీద్దామా !

సూటూ, బూటూ వేసుకున్న ఈ చిన్నోడి బొమ్మ ఎలా గీయాలో నేర్చుకుందామా.



దారి ఎక్కడమ్మా?

పుట్టినరోజు అంటే స్నేహితులనందరినీ పిలవాలి. కేకు కట్‌చేయాలి....ఆగండి...ఆగండి.. ముందు క్యాండిల్ వెలిగించి ఆఫ్ చేయాలి కదా! ఈ బొమ్మలో క్యాండిల్ పుట్టినరోజు కేకు దగ్గరకు చేరడానికి దారి చూపించండి.



పేర్లు పసిగట్టండి

ఈ పటంలో ఇంగ్లీషు అక్షరాలలో కింద ఉన్న జంతువుల పేర్లు దాగున్నాయి. ఇంకెందుకు ఆలస్యం...అవి ఎక్కడున్నాయో పసిగట్టి కలిపేయండి.



y	t	w	p	l	p	o	s	s	u	m	f
d	i	n	g	o	y	a	p	q	m	e	d
a	g	a	w	o	m	b	a	t	l	h	b
f	k	n	k	a	v	i	l	i	s	j	a
w	a	d	r	g	e	p	d	u	a	v	n
b	n	i	c	t	h	o	p	y	l	o	d
n	g	h	w	u	c	y	p	e	a	d	i
e	a	c	e	o	t	m	m	k	o	o	c
s	r	e	r	a	q	u	r	k	k	o	o
o	o	c	l	t	y	f	k	s	r	k	o
u	o	p	w	a	l	l	a	b	y	r	t
e	m	a	r	r	u	b	a	k	o	o	k

bandicoot
dingo
emu
koala
platypus
wallaby

crocodile
echidna
kangaroo
kookaburra
possum
wombat

రంగులేద్దాం...

ఈ బొమ్మ చూసారా!
ఇందులో వికెట్లు, బ్యాటు,
బంతి, శిరస్త్రాణం పెట్టుకున్న
పిల్లోడు .... బలేఉంది
కానీ...రంగులేస్తే ఇంకా
బాగుంటుందేమో కదా!
అయితే ఇంకెందుకు ఆలస్యం
మీకు నచ్చిన రంగులు
అద్దేయండి...చూడముచ్చటగా
బొమ్మను తీర్చిదిద్దండి.



సీతాకోక చిలుకలు ఎన్ని?

ఈ చిత్రంలో ఎన్ని సీతాకోక
చిలుకలు ఉన్నాయో
లెక్కబెట్టగలరా.



పంది బొమ్మ వేద్దాం



తీర్పు

సీతాపురంలో రాఘవయ్య, కృష్ణమూర్తి అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. రాఘవయ్యకు ధనాశ ఎక్కువ. అతను ఒకసారి కృష్ణమూర్తి దగ్గర పెద్దమొత్తంలో ధనం అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత ఎన్ని సార్లు అడిగినా రాఘవయ్య అతనికి డబ్బు ఇవ్వకపోగా కృష్ణమూర్తి డబ్బు అడగటం కోసం వెళ్లిన ప్రతిసారీ ఏవో అబద్ధాలు కల్పించి చెప్పేవాడు. ఒకనాడు కృష్ణమూర్తి రాఘవయ్య ఇంటికి వెళ్లి "నా డబ్బు ఎప్పుడు ఇస్తావు?" అని గట్టిగా నిలదీయడంతో రాఘవయ్య కిందపడి గిలగిల కొట్టుకుంటూ అనారోగ్యం ఉన్నట్టు నటించాడు. అంతలో అతని భార్య లోపలి నుంచి వచ్చి "అయ్యో! అయ్యో! అనారోగ్యంతో బాధపడుతున్న నా భర్తను డబ్బు కోసం పీడిస్తావా?" అంటూ శాపనార్థాలు పెట్టసాగింది.

కృష్ణమూర్తి పక్కకు పోగానే

భార్యాభర్తలిద్దరూ 'ఇక నుండి అతడు డబ్బుకోసం ఎప్పుడొచ్చినా ఇలాగే చేయాలి' అనుకోవడం అతని చెవినపడింది. కృష్ణమూర్తి కొంతకాలం తర్వాత మళ్లీ వెళ్లి డబ్బు అడగబోగా, రాఘవయ్య ఈసారి కూడా కిందపడి గిలగిల కొట్టుకోసాగాడు. అతని భార్య కృష్ణమూర్తిని తిట్టడం మొదలుపెట్టింది.

వీళ్ల నాటకాన్ని ఎలాగైనా బయటపెట్టాలనుకున్న కృష్ణమూర్తి ఈ విషయం మొత్తం గ్రామ పెద్దకు వివరించాడు.

గ్రామపెద్ద ఒక ఉపాయం ఆలోచించాడు. ఆ ప్రకారం కృష్ణమూర్తి కొద్దిరోజుల తర్వాత మళ్లీ రాఘవయ్య ఇంటికి వెళ్లి "నా అప్పు ఎప్పుడు తీరుస్తావు" అని అడగటంతో రాఘవయ్య కిందపడి గిలగిల కొట్టుకోసాగాడు.

అప్పుడే లోపలికి వచ్చిన గ్రామపెద్ద తన వెంట వచ్చిన వైద్యుడికి సైగ చేయడంతో వైద్యుడు రాఘవయ్య నాడిని పరీక్షించి "అయ్యా! ఇతని పరిస్థితి ఆఖరి దశలో ఉంది. ఏవైనా ముఖ్యమైన పనులు వుంటే పూర్తి చేయడం మంచిది" అన్నాడు.

అంతట గ్రామపెద్ద "రాఘవయ్య తదనంతరం ఇల్లు భార్యకు చెందాలి. భోషాణం పెట్టెలోని డబ్బు తీసి కృష్ణమూర్తి ఇచ్చిన అప్పుకు వడ్డీతో సహా చెల్లించాలి" అన్నాడు. గ్రామపెద్ద తీర్పు గురించి తెలిసిన వారంతా రాఘవయ్య తిక్క కుదిరిందని సంతోషించారు.

కొత్త పుస్తకాలు

నీటి వివాదాల వెనుక నిజాలు

మొన్నటికి మొన్న ఉమ్మడి రాష్ట్రం నడిబొడ్డున నీటికోసం యుద్ధవాతావరణం ఏర్పడింది. మాటల తూటాలు పేలాయి. వాస్తవాలు మరుగునపడి వాదనలు పెరిగాయి. ఇరువైపులా ప్రజలను రెచ్చగొట్టె ప్రయత్నం జరిగింది. రాజకీయ ప్రయోజనాల కోసం నిజాలను దాచే ప్రయత్నాలు ఇప్పుడూ, గతంలోనూ జరుగుతున్న సంగతి మనకు తెలుసు. అయితే లెక్కలెప్పుడూ వాస్తవాలు చెపుతాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీటిసమస్యల విషయంలో వాస్తవాలను సామాన్యులకు సైతం తెలియజేసేందుకు మల్లారెడ్డి గారు చేసిన ప్రయత్నంలోనుండి పుట్టింటే "రాష్ట్రంలో నదీజలాలు, ప్రాజెక్టులు, వినియోగం, వివాదాలు" పుస్తకం.

"రాష్ట్రంలో నదీజలాలు" పేరుతో రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకం మనకు ఈసమయంలో ఉపయోగపడుతుంది, ఉమ్మడి రాష్ట్రానికి రైతుసంఘం కార్యదర్శిగా పనిచేసిన మల్లారెడ్డి నీటి వివాదాలు పరిష్కారానికి అనేకమార్గాలు ఇందులో సూచించారు. గతంలో మహా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య "ఆంధ్ర ప్రదేశ్ లో సమగ్ర నీటి పథకం" పేరున రాసిన పుస్తకం అనేక వివాదాల పరిష్కారానికి సరైన మార్గంచూపింది. అదే కోవలో ఈ పుస్తకం మనకు దారిచూపిస్తుంది. ప్రభుత్వాధినేతలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం ప్రజలను రెచ్చగొడుతున్న తీరులోని నిజానిజాలను మనం ఈ పుస్తకంలో వెతకవచ్చు.

రాష్ట్రంలో నదీజలాలు, ప్రాజెక్టులు, వినియోగం, వివాదాలు.
రచన:- సారంపల్లి మల్లారెడ్డి,
వెల :- 100 రూ/
పేజీలు : 240/
ప్రతులకు :- ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీల్లో

ఉమ్మడి రాష్ట్రంలో 40 నదులు ప్రవహిస్తున్నాయి. వీటిలో ఏ నది ఎక్కడ పుట్టింది, ఏ నది ఏఏ ఉప నదులను కలుపుకుని ప్రవహిస్తుంది, ఎంతనీరు లభ్యం అవుతుంది, సవివరమైన చిత్రణ మనకు ఇక్కడ దొరుకుతుంది. నదుల వారీ ప్రాజెక్టులు, నీటి వినియోగం, మిగులు జలాలు గురించి మనం తెలుసుకోవచ్చు. జిల్లాల వారిగా ప్రాజెక్టులు సాగువివరాలు ఉన్నాయి. ఇప్పుడు వినిపిస్తున్న వాదనలలో వాస్తవాలు ఈ పుస్తకం అద్దంలాగా పట్టి చూపిస్తుంది. వాస్తవాలను తెలుసుకోవటానికి దారి చూపిస్తుంది. ప్రారంభంలోనే నీటిప్రాజెక్టులు వాటికి సంబంధించిన పదాల వివరణ ఉంది. చివర ఇచ్చిన 12 అనుబంధాలు కొత్త ప్రతిపాదనలను ముందుకు తెస్తూంది. ఇప్పుడున్న వివాదాలకు పరిష్కారం చూపిస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2764.447 టియంసి ల నికర జలాలను వాడుకునే హక్కు 1975 బచావత్ అవార్డు ద్వారా మనకు ఉంది. నదుల చివరి రాష్ట్రం కనుక మిగులు జలాలను వినియోగించుకునే హక్కు మనకు ఉన్నది. కాని సుమారు 2000 టియంసిలను మాత్రమే మనం వాడుకుంటున్నాం. ఏటా కృష్ణా, గోదావరి, పెన్నా నదుల ద్వారా 5000 టియంసిలు సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని వినియోగంలోకి తెచ్చే చిత్తశుద్ధి పాలకులలో లోపించింది. జలయజ్ఞం ధనయజ్ఞంగా మారిన విషయం మనకు తెలుసు. అసలు వ్యవసాయమే దండగనే పాలకులూ మనకున్నారు. వారి వైఫల్యాలనే ఉద్రేకాలుగా మార్చే ప్రయత్నాలు నిరంతరం జరుగుతున్నది. ఉద్వేగాలు రేచ్చగొట్టి నీటినుండి నిప్పులు పుట్టించి ప్రజలను సమిధలుగా మార్చే పన్నాగాలూ ఉన్నాయి. నిజాలు వెలికి తేచ్చి ప్రజలకు దారిచూపించి పాలకుల కుయుక్తులను ఎండగట్టటానికి ఈ పుస్తకం తప్పక ఉపయోగపడుతుంది. అయితే అచ్చుతప్పులు అనేకం ఉన్నాయి, వాటిని రాబోయే ప్రచురణలో సరిదిద్దు కోవాలి.

\- భవిష్య

మానవత్వం మేళవించిన కథానికలు

అసలు రాయడం తక్కువవుతున్న ఈ రోజుల్లో ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించడం ముదావహం. ఆ దిశగా కథాకేళి మాసపత్రిక వారు కథానికల పోటీ నిర్వహించి, ఆ పోటీలో నెగ్గిన కథలను కథాకేళి పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఇందులో మొత్తం పదకొండు కథలున్నాయి. కథానికల పోటీలో మొదటి బహుమతి పొందిన "మోడల్" కథలో ఎంతో మంది చిత్రకళాకారులకు వస్తువుగా ఉపయోగపడిన ఒక మోడల్ మహిళ జీవితంలోనుండి పుట్టిన కథానిక ఇది. ఈ కథానికలో శిల్పం కొత్తగా ఉంది. కానీ ముగింపు మాత్రం రొటీన్‌గా అనిపిస్తుంది. రెండవ బహుమతి పొందిన కథానిక "ఔన్నత్యం" "ఆపాల పెద్దమ్మ" ఇవి మాత్రం మానవతా దృక్పథానికి ప్రతీకలుగా అనిపిస్తాయి. ఇక కథానిక పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథానిక "గతమెంతో ఘనకీర్తి" లో గతంలోని ఘనకీర్తికి పొంగిపోవడం భారతీయుల హాబీ. అనుసరిస్తే ఆ ఘనకీర్తిని వర్తమానంలోనూ సొంతం చేసుకోవచ్చు అంటాడు రచయిత. నా వయస్సు ఇప్పుడు యాభైఏళ్లు. ఒక ముప్పై యేళ్లు వెనక్కి తీసుకెళ్ల స్వామీ అనే కోరికతో మొదలవుతుంది . ఇందులో రచయిత చెప్పాలనుకున్న అంశం మధ్య మధ్యలో పక్కదోవ పట్టింది అనిపిస్తోంది. "మహాప్రస్థానం" కథానిక వృద్ధాశ్రమ నిర్మాణం చేపట్టే లక్ష్యంగా సాగుతుంది. ఇక "గూగుల్ గృహిణి...సాఫ్ట్‌వేర్ సహచరుడు" కథానిక పేరు చదువుతుంటేనే నవ్వు రాకమానదు...అలాగే కథ చదువుతుంటే కూడా నవ్వాగదు. ఉద్యోగం, ప్రమోషన్‌ల మధ్య కొట్టుమిట్టాడే ఇద్దరు యువ దంపతుల కథనాన్ని బాగా చిత్రించారు రచయిత్రి. అయితే ఇది కాస్త వాస్తవానికి దూరంగా ఉంది. మొత్తంగా కథానికలన్నీ ఒకసారి చదవచ్చు. అయితే ఈ ఇవి మధ్యతరగతి కుటుంబాల్లోని సంఘటనల నుండి పుట్టుకొచ్చినవే. ఈ కథానికలన్నింటినీ ఒక పుస్తకంగా తేవడంలో సహకరించిన వేదగిరి రాంబాబు గారు, ఆయనకు కథాసాహిత్యం పట్ల ఉన్న అభిమానాన్ని తెలియచేస్తున్నది.

\- మోహన్

కథాకేళి,
సంకలనం :
ఎం. నాగకుమారి,
ఎం రామారావు,
పేజీలు : 90 వెల : 60 రూ॥
ప్రతులకు : శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్.ఐ.జి -1, ప్లాట్ -10, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్,

అన్నీ పాక్ బొమ్మలే

ఈ బొమ్మలను చూస్తుంటే ఏమనిపిస్తోంది?! విదేశీ కంపెనీలు తయారుచేసిన వాటిలా కనిపిస్తున్నాయా?! ఇందులో సగం కరెక్టే. ఎలాగంటే ఈ బొమ్మలన్నీ పాకిస్తాన్‌లో తయారైనవి. కాకపోతే కార్పొరేట్ కంపెనీ బొమ్మలు కావివి. 'థట్ట ఘలమ్మా థెరోకా' అనే మారుమూల గ్రామస్థులు తయారుచేసినవి. పాకిస్తాన్ సంస్కృతీ సంప్రదాయాలు ఈ బొమ్మల కట్టు బొట్టులో తొణికిసలాడుతాయి . మరీ ముఖ్యంగా పంజాబ్, సింధ్, ఖైబర్, బెలూచిస్తాన్ రాష్ట్రాలే కాక కాశ్మీర్, కలాష్ లోయలకు చెందిన ప్రజల జీవనశైలి కూడా ఈ బొమ్మల్లో కనిపిస్తుంది. 'థట్ట' గ్రామస్తులు చేత్తో తయారుచేసిన ఈ బొమ్మలు ఇప్పటికి నలభై దేశాలకు ఎగుమతి అయ్యాయి. అంతేకాదు! ఇంటర్నేషనల్ డాల్స్ మ్యూజియం (ఆమ్‌స్టర్‌డామ్), ఇంటర్నేషనల్ డాల్స్ మ్యూజియం (ఐస్‌లాండ్), దుబాయ్ షాపింగ్ ఫెస్టివల్ (దుబాయ్), ఇంటర్నేషన్ మ్యూజియం ఫర్ చిల్డ్రన్ (టర్కీ)...లో ఈ చిట్టి పొట్టి బొమ్మలు కొలువు తీరి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

●





నిమ్మ పళ్ల పండగ

ప్రపంచంలో బోలెడన్ని వింతలు, విశేషాలు జరుగుతుంటాయి. వాటిని చూసినప్పుడు, చదివినప్పుడు తెగ ఆశ్చర్యపోతుంటాం. మన ముందున్న భారీ చిత్రాలన్నీ ఆ కోవకు చెందినవే. నిమ్మ, కమలా పళ్లతో చేసినవే ఈ బడా బొమ్మలు. ఫ్రాన్స్ అందుకు వేదిక. సాధారణంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు వారాల పాటు ఈ పండుగ జరుపుకుంటారు. రెండు లక్షల మంది సందర్శకులు వస్తుంటారని అంచనా. ఈ భారీ బొమ్మల తయారీకి 145 టన్నుల సిట్రస్ పళ్లను ఉపయోగిస్తారు. 300 వందల మంది నిపుణులు వీటి తయారీలో పాల్గొంటారు. ఇక వీధుల్లో పాటలు పాడేవారు, డాన్స్ చేసేవారు, వివిధ రకాల వాద్యాలు వాయించేవారు, మాస్కులు తగిలించుకున్న వారు... చూడ్డానికి రెండు కళ్లూ చాలవనుకోండి.